


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 22-02-2025 | సంపుటి - 21 | సంచిక - 304 | రూ : 4 | పేజీలు: 8




# మిర్చి రైతులకు ఊరట

- సాగు వ్యయం-మార్కెట్ ధరల మధ్య ఉన్న తేడాను చెల్లించేందుకు కేంద్రం ఓకే
- ఎంఐఎస్ కింద 75% పంటను కొనుగోలు చేయడానికీ సుముఖం
- చంద్రబాబు విజ్ఞప్తులకు కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సానుకూల స్పందన
- ఎగుమతుల్లో సమస్యలపై త్వరలో రాష్ట్రస్థాయి సదస్సు

దిల్లీ: ధరలు పడిపోయి ఇబ్బందులు పడుతున్న ఆంధ్రప్రదేశ్ మిర్చి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన విజ్ఞప్తులకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, ఆ శాఖ కార్యదర్శి దేవేష్ చతుర్వేది శుక్రవారం ఇక్కడి కృషిభవన్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి చర్చించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ తరఫున పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, అమరావతి నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇందులో ప్రధానంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద కొనుగోలు చేసి మార్కెట్ ధర సాగు ఖర్చుకు మధ్య ఉన్న తేడాను కేంద్రం చెల్లించడం, ఎంఐఎస్ కింద సేకరించే సరకు గరిష్ఠ పరిమితిని 25% నుంచి 75% వరకు పెంచడం, మిర్చి సాగు వ్యయాన్ని ఐకార్ నిర్ణయించిన ధర ప్రకారం కాకుండా ఏపీ ప్రభుత్వం ఖరారు చేసిన రూ.11,600ని పరిగణనలోకి తీసుకోవడం, ఎగుమతులకు ఉన్న అడ్డంకులను తొలగించడంపైనే చర్చించారు. ఇందులో తొలి మూడు డిమాండ్లకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఎగుమతుల విషయంపై మాత్రం రాష్ట్రంలో ప్రత్యేక సదస్సు నిర్వహించి క్షేత్రస్థాయిలోని రైతులు, ఎగుమతిదారులు, ఇతర భాగస్వామ్యపక్షాల సలహాలు, సూచనలు తీసుకొని వాటిని అమల్లోకి తెస్తామని స్పష్టం చేసినట్లు వెల్లడించారు.

* **కేంద్ర వ్యవసాయ మంత్రి భరోసా: రామ్మోహన్‌నాయుడు**

"సీఎం చంద్రబాబు వినతిపై


తరువాయి 2లో


# పాలనపై చర్చిద్దామా!

- కేసీఆర్, కిషన్‌రెడ్డిలకు ఇదే నా సవాల్
- భారాస హయాంలో పాలమూరును పడావు పెట్టారు
- కృష్ణా జలాలు తరలిపోతుంటే చూస్తూ కూర్చున్నది కేసీఆరే
- నారాయణపేట బహిరంగసభలో సీఎం రేవంత్ ఆరోపణ
- ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

మహబూబ్‌నగర్, నారాయణపేట : కేంద్రంలో 11 ఏళ్ల మోదీ పాలన.. రాష్ట్రంలో పదేళ్ల కేసీఆర్ పాలన.. 14 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా అంటూ భాజపా, భారాస నేతలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. నారాయణపేట జిల్లాలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ప్రారంభం, రూ.1,000 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం తదితర కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. "పదేళ్లలో భారాస చేయని పనులు మేం చేశాం..


తరువాయి 2లో




## 65 రోజులు..
# 5,405 మి.యూనిట్ల కొనుగోలు

- అనూహ్యంగా పెరుగుతున్న రోజువారీ విద్యుత్ డిమాండ్
- ఈ నెలలో నాలుగోసారి 'అత్యధికం' నమోదు

హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్తు రోజువారీ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. శుక్రవారం మరోసారి అత్యధిక డిమాండ్ నమోదైంది. కాగా నిరంతర విద్యుత్తు సరఫరాకు గాను రోజూ డిస్కంలు 'భారత ఇంధన ఎక్స్ఛేంజి (ఐఈఎక్స్)'లో పెద్దఎత్తున కరెంటు కొనుగోలు చేస్తున్నాయి. గత డిసెంబరు 1 నుంచి ఈ నెల 3 వరకూ 65 రోజుల్లో 5,405.23 మిలియన్ యూనిట్ల (మి.యూ.) కరెంటును కొనుగోలు చేశాయి. ఒక్కోరోజు ఒక్కో సమయంలో అధిక డిమాండ్ కారణంగా ఒక యూనిట్‌కు రూ.10 వరకూ చెల్లించి కొంటేనే


తరువాయి 2లో






# అదానీపై అమెరికాలో దొంగతనం కేసు

: రాహుల్‌ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ రాంసింగ్

రాయ్‌బరేలీ: ప్రధాని నరేంద్ర మోదీ తన అమెరికా పర్యటన సందర్భంగా అదానీ వ్యవహారం వ్యక్తిగత విషయమంటూ పేర్కొనడాన్ని


తరువాయి 2లో


## భాషల మధ్య
# వైరం సృష్టించొద్దు...

- అవన్నీ పరస్పర సహకారంతో సుసంపన్నమైనవే
- త్రిభాషా సూత్రంపై తమిళనాడు ప్రభుత్వ అభ్యంతరాల నేపథ్యంలో ప్రధాని మోదీ వ్యాఖ్య
- రాజకీయాలకతీతంగా వ్యవహరించాలంటూ సీఎం స్టాలిన్‌కు కేంద్ర విద్యా మంత్రి లేఖ
- తేనెతుట్టెపై రాళ్లు వేయొద్దంటూ

తమిళనాడు ముఖ్యమంత్రి హెచ్చరిక




2లో




## దేశానికి ప్రపంచస్థాయి
# నాయకులు అవసరం

- సోల్ సదస్సులో ప్రధాని మోదీ ఉద్ఘాటన


2లో


## చైనాలో కొవిడ్ మాదిరి
# కొత్త వైరస్ గుర్తింపు!

చైనా లో కొవిడ్ మాదిరిగా ఉన్న కొత్త వైరస్‌ను పరిశోధకులు గుర్తించారు. జంతువుల నుంచి మానవులకు సంక్రమించే ముప్పు ఉన్నట్లు భావిస్తున్నారు. గబ్బిలాల్లో గుర్తించిన ఈ కొత్త వైరస్‌ను 'హెచ్‌కెయూ5 కోవ్2'గా పేర్కొన్నారు. ఇది కొవిడ్ 19కి కారణమైన SARSCoV2ను పోలి ఉన్నట్లు పరిశోధనల్లో గుర్తించినట్లు హాంకాంగ్‌కు చెందిన 'సౌత్‌చైనా మార్నింగ్ పోస్ట్' పత్రిక తన కథనంలో పేర్కొంది. గబ్బిలాల్లో కరోనా వైరస్‌లపై విస్తృత పరిశోధనలు చేసి 'బ్యాట్ ఉమెన్'గా పేరొందిన ప్రఖ్యాత వైరాలజిస్టు షీ ఝెంగ్‌లీ ఈ పరిశోధనా బృందానికి సారథ్యం వహించారు. ఇందులో గాంఝౌ లేబొరేటరీ, గాంఝౌ అకాడమీ ఆఫ్ సైన్సెస్, వుహాన్ విశ్వవిద్యాలయంతో పాటు వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి చెందిన


తరువాయి 2లో




## ట్రంప్ ఎజెండాకు
# సెనెట్‌లో తీవ్ర వ్యతిరేకత

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎజెండాకు రానున్న రోజుల్లో చట్ట సభల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అక్రమ వలసల నిరోధానికి, సైనిక అవసరాలకు రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన 340 బిలియన్ డాలర్ల బడ్జెట్ తీర్మానంపై గురువారం సెనెట్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఎట్టకేలకు తీర్మానం 5248 ఓట్లతో నెగ్గినా,


తరువాయి 2లో




# పాలనపై చర్చిద్దామా!

(మొదటిపేజీ తరువాయి)

అయినా మా పరిపాలన బాగాలేదని అంటున్నారు. భాజపా నుంచి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భారాస నుంచి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కాంగ్రెస్ తరఫున నేను, దామోదర్ రాజనర్సింహ వస్తాం. చర్చకు సిద్ధమా.. ప్రదేశం ఎక్కడో మీరే చెప్పండి'' అని విపక్ష నాయకులకు సీఎం సవాల్ విసిరారు. ''నాడు నరేంద్ర మోదీ.. స్విస్ బ్యాంకుల్లోని నల్లధనం తీసుకొచ్చి పేదల ఖాతాల్లో వేస్తానన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. నీరవ్ మోదీ, చోక్సీ లాంటి వాళ్లు బ్యాంకులకు రూ. లక్షల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోతే ఏమీ చేయలేకపోయారు. మీరు తెచ్చిన నల్లచట్టాలను వ్యతిరేకిస్తూ.. వేల మంది రైతులు నిరసన చేపట్టి వాటిని రద్దు చేయించారు'' అంటూభాజపాపై విమర్శలు గుప్పించారు.

''కేసీఆర్ ఇంకా గట్టిగా కొడతానంటున్నారు. ఆయన గట్టిగా కొట్టేదేమిటో మనందరికీ తెలుసు. ఫాంహౌస్‌లో పార్టీలు చేసుకునే మీ కుమారుడిని కొట్టండి. దిల్లీలో లిక్కర్ దందా చేసి తెలంగాణ పరువు తీసిన మీ బిడ్డను కొట్టండి. రూ. లక్ష కోట్లు మింగిన మీ అల్లుడిని కొట్టండి. కాంగ్రెస్‌ను కొడతానంటే మా కార్యకర్తలు ఊరుకోరు'' అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ''ఏడాదికి 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయిస్తాం. అవసరమైతే అయిదు వేల ఇళ్లు ఇస్తాం. నాడు 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇందిరమ్మ ఇళ్లు ఉన్న ఊళ్లలో మేం పోటీ చేస్తాం. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎక్కడ ఉన్నాయో అక్కడ మీరు పోటీ చేస్తారా?'' అని భారాసకు సవాల్ చేశారు. కేసీఆర్.. మా కన్నీళ్లు ఎందుకు తుడవలేదు

''నీళ్లు.. నాగరికతను, పంటలను, పసిడిని పండిస్తాయి.. దశాబ్దాలుగా 811 టీఎంసీల కృష్ణా జలాలు పారుతున్నా మా పాలమూరు ప్రాంతం కష్టాలు తీరలేదు. కేసీఆర్ మా కన్నీళ్లు ఎందుకు తుడవలేదో జవాబు చెప్పాలి. పాలమూరురంగారెడ్డితోపాటు కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు తదితర ప్రాజెక్టులను పూర్తి చేయలేదు. పదేళ్లలో రూ.2 లక్షల కోట్లు సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు పెడితే అందులో రూ.లక్ష కోట్లు కాళేశ్వరానికే వెచ్చించారు. కాళేశ్వరం కుంగిపోయింది. రూ.వేల కోట్లు కాజేశారు. మా ప్రాజెక్టులు పడావు పెట్టారు. నీళ్లు రాయలసీమకు, పదవులేమో మీ ఇంట్లోకి తెచ్చారు. కష్టాలు మాకు మిగిలాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు ఊడిగం చేసి.. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును 4 వేల క్యూసెక్కుల నుంచి 40 వేల క్యూసెక్కులకు పెంచి కృష్ణా నది నీళ్లు తరలించడానికి సహకరించింది మీరే కదా. తర్వాత వైఎస్ జగన్‌ను పిలిపించి 6 గంటలు చర్చించి, రాయలసీమ ఎత్తిపోతల పథకానికి పథకం రచించింది మీరు కాదా. పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి ప్రాజెక్టుల ద్వారా రాయలసీమకు నీళ్లు తరలించుకుపోయేందుకు అవకాశం కల్పించిందీ మీరే. రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్‌ల నుంచి కృష్ణా జలాలను సీమకు తరలించుకుపోతుంటే ఏనాడైనా అడ్డుకున్నారా?.. అదే మాకు శాపమైంది. రాయలసీమ ప్రాజెక్టు పూర్తయితే రోజుకు 10 టీఎంసీలు అంటే 30 రోజుల్లో 300 టీఎంసీలు తరలించుకుపోయే ప్రమాదం ఉంది'' అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం ఆరోపించారు. ''కేసీఆర్ మన ప్రాజెక్టులను పక్కన పెడితే నేనొచ్చాక వాటిని పూర్తి చేయడానికి కృషి చేస్తున్నా. నిర్వాసితులకు పరిహారం ఎక్కువ ఇచ్చి అయినా పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తా'' అని హామీ ఇచ్చారు.

# 65 రోజులు.. 5,405 మి.యూనిట్ల కొనుగోలు

(మొదటిపేజీ తరువాయి)

నిరంతర సరఫరా సాధ్యపడుతోంది. గత డిసెంబరులో రాష్ట్రంలో మొత్తం 7,292.69 మి.యూ. కరెంటు సరఫరా కాగా ఇందులో 37.39% (2,726.40 మి.యూ.) ఎక్స్ఛేంజీలో డిస్కంలు కొన్నాయి. గత నెల (జనవరి)లో 30.78% కొనుగోలు చేశాయి. తెలంగాణ డిస్కంలు రోజుకు సగటున డిసెంబరులో 91.51 మి.యూ., జనవరిలో 83.59 మి.యూ. కొన్నాయి. కాగా ఈ నెలలో వెయ్యి, వచ్చే నెలలో 1,046 మి.యూ. మేర కొనాల్సి ఉంటుందని డిస్కంలు తాజాగా ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నాయి.

**ఎందుకీ కొనుగోలు..?**

రాష్ట్రంలో కరెంటు సరఫరాకు డిస్కంలు దీర్ఘకాలిక విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలను చేసుకున్నాయి. ఈ ధరలు అధికంగా ఉండటంతో ఎక్స్ఛేంజీలో రోజులో ఒక్కో సమయంలో అంతకన్నా తక్కువ రేట్లకు లభిస్తున్నందున తాత్కాలిక పద్ధతిలో కొంటున్నట్లు డిస్కంలు తెలిపాయి. అయితే ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 10, సాయంత్రం 6 నుంచి 10 గంటల మధ్య భారీగా డిమాండ్ పెరుగుతున్నందున ఆ సమయంలో కొరతతో ఎక్స్ఛేంజీలో అధిక రేట్లకు కూడా కొనాల్సి వస్తోంది. కరెంటును ఎక్స్ఛేంజీలో ప్రతీ పావుగంట స్లాట్‌కు ఒక్కోరేటుకు విక్రయిస్తారు. డిమాండ్ అధికంగా ఉండే సమయంలో యూనిట్ ధర గరిష్ఠంగా రూ.10కి చేరుతోంది. లేని సమయంలో రూ.2 నుంచి 3కే లభిస్తుంది. డిమాండ్ ఉన్న సమయంలో అధిక ధరలకు కొంటున్నా, తక్కువ రేట్లకు లభించే సమయంలోనూ కొంత కొంటూ మొత్తం కొనుగోలు సగటు రేటును తగ్గించడం ద్వారా ఆర్థికభారం పెద్దగా పడకుండా చూస్తున్నట్లు డిస్కంలు చెబుతున్నాయి. ఉదాహరణకు గత నెలలో మొత్తం 2,591 మి.యూ. కరెంటును కొన్నాయి. ఇందులో డిమాండ్ పెరిగిన సమయంలో అధిక ధరలకు కొన్నది 1,190 మి.యూ. మాత్రమే. మిగిలిన 1,401 మి.యూ. ఎక్స్ఛేంజీలో రేటు పడిపోయిన సమయాల్లో కొనడం వల్ల చివరికి నెల మొత్తం సగటు యూనిట్ కొనుగోలు ధర రూ.3.83కి చేరినట్లు డిస్కంలు ప్రభుత్వానికి తెలిపాయి. రోజుకు కనీసం రూ.40 కోట్ల వరకూ చెల్లించి ఎక్స్ఛేంజీలో తాత్కాలిక అవసరాలకు కరెంటును కొంటేనే రాష్ట్రంలో నిరంతర సరఫరా సాధ్యమవుతోంది.

# మిర్చి రైతులకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వెంటనే స్పందించి ఈ సమావేశం ఏర్పాటుచేశారు. గురువారం మధ్యప్రదేశ్‌లో ఉన్నందున చంద్రబాబును కలవలేకపోయిన వ్యవసాయమంత్రి.. శుక్రవారం దిల్లీకి రాగానే తొలి సమావేశం మిర్చి రైతుల విషయంపైనే ఏర్పాటుచేసి సమస్యను అన్ని కోణాల్లో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. మిర్చి కొనుగోళ్లు త్వరగా ప్రారంభిస్తామని చెప్పారు. పంట ఉత్పత్తి వ్యయానికి, కొనుగోలు ధరకు మధ్య అంతరాన్ని వీలైనంత త్వరగా చెల్లిస్తామని చెప్పారు. ఎంఐఎస్ కింద 25% వరకు ఉన్న గరిష్ఠ పరిమితిని 75% వరకు పెంచుతామని హామీ ఇచ్చారు. మిర్చిసాగుకు క్వింటాకు రూ.10వేల పైచిలుకు ఖర్చవుతుందని కేంద్రం నిర్ణయిస్తే... మేం రూ.11,600 అవుతుందని గట్టిగా చెప్పి, ఆ మేరకు పెంచాలని డిమాండ్ చేశాం. దీంతో సాగు వ్యయాన్ని పెంచాలని ఐకార్ అధికారులకు శివరాజ్‌సింగ్ చౌహాన్ గట్టిగా చెప్పారు. ఇది చాలా సానుకూల పరిణామం. గతంలోలా ఎగుమతులు జరగకపోవడానికి భౌగోళిక, రాజకీయ అంశాలు కొన్ని ఉన్నాయి. అయినా ఎగుమతుల ప్రోత్సాహానికి ఏం చర్యలు తీసుకోవాలన్నదానిపై చర్చ జరిగింది. దీనిపై త్వరలో రాష్ట్రంలోనే ఎగుమతిదారులు, ఎఫ్‌పీఓలు, రైతుల సదస్సు నిర్వహించి, వారి ద్వారానే సమస్యలు తెలుసుకొని వాటిని సరిదిద్దే చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇప్పుడు మాత్రం మార్కెట్ రేటుకు, రైతులకు సాగుకోసం అయ్యే ఖర్చుకు మధ్య ఉన్న తేడాను కేంద్రం వెంటనే చెల్లిస్తుంది. కేంద్రం ఇచ్చే ప్రతి పైసా రైతుకే వెళ్తుంది కాబట్టి వీలైతే ఈ ధరను మరింత పెంచాలని అడిగాం. ఇప్పుడు ఐకార్ దానిపై దృష్టిసారించింది. ఈ నిర్ణయంతో గుంటూరు, పల్నాడు, రాయలసీమల్లో ఉన్న మిర్చి రైతులకు ప్రయోజనం కలుగుతుంది. చంద్రబాబునాయుడు అంటే తమకు చాలా గౌరవమని, ఆయన ఒక సమస్య తెచ్చారంటే అందులో ఎంతో తీవ్రత ఉంటుంది కాబట్టి.. దానికి తామూ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ చెప్పారు'' అని రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు.

# భాషల మధ్య వైరం సృష్టించొద్దు

దిల్లీ, చెన్నై : జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం తీవ్ర రూపం దాల్చుతోంది. ఎన్‌ఈపీ పేరుతో హిందీని తమపై బలవంతంగా రుద్దేందుకు యత్నిస్తున్నారని, రాష్ట్రానికి రావాల్సిన నిధులను నిలిపివేశారని తమిళనాడు సీఎం ఆరోపిస్తుండగా.... భాషలను రాజకీయ కోణంలో చూడవద్దంటూ కేంద్ర విద్యాశాఖ మంత్రి కోరారు. తేనెతుట్టెపై రాళ్లు వేయవద్దంటూ స్టాలిన్ ఘాటుగా ప్రతిస్పందించిన నేపథ్యంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతీయ భాషల మధ్య మంటలు పెట్టొద్దంటూ ప్రధాని హితబోధ చేశారు. దేశ భాషల మధ్య ఎన్నడూ వైరం లేదని, అవన్నీ పరస్పరం చేయూతనందించుకుంటూ సుసంపన్నమయ్యాయని తెలిపారు. భాషల ప్రాతిపదికన విభేదాలు సృష్టించే యత్నాలు జరిగినప్పుడు భారతీయ భాషా వారసత్వం దీటుగా వాటికి సమాధానమిచ్చిందని పేర్కొన్నారు. భాషాపరమైన దురభిమానాలకు దూరంగా ఉండటం మనందరి సామాజిక బాధ్యత అని గుర్తు చేశారు. దిల్లీలో శుక్రవారం నిర్వహించిన అఖిల భారత మరాఠీ సాహిత్య సమ్మేళనం కార్యక్రమంలో ప్రసంగిస్తూ ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

**లేఖల సమరం**

రాజకీయ అభిప్రాయ భేదాలకు అతీతంగా జాతీయ విద్యా విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం ఓ లేఖలో సూచించారు. జాతీయ విద్యావిధానం2020 భాషా స్వేచ్ఛను కలిగి ఉందని, విద్యార్థులు ఇష్టపడే భాష చదివే అవకాశం కల్పిస్తోందని తెలిపారు. ప్రధాని మోదీకి గురువారం తమిళనాడు సీఎం లేఖ రాసిన నేపథ్యంలో కేంద్ర మంత్రి ఈ మేరకు స్పందించారు. దీనిపై ముఖ్యమంత్రి స్టాలిన్ వెంటనే స్పందిస్తూ...'తమిళ భాషకు, ప్రజలకు, రాష్ట్రానికి నష్టం కలిగించే చర్యలను అనుమతించేది లేదని' స్పష్టం చేశారు. సమగ్రశిక్షా పథకం కింద తమ రాష్ట్రానికి రావాల్సిన రూ.2,152 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయాలని పునరుద్ఘాటించారు. 1965లో ఎగసిన హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ...'తేనెతుట్టెపై రాళ్లు వేయరాదని' హెచ్చరించారు. తమిళనాడులో ద్విభాషా సూత్రాన్నే (తమిళం, ఆంగ్లం) అమలు చేస్తామని ఉపముఖ్యమంత్రి ఉదయనిధి కూడా తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని విపక్ష ఏఐఏడీఎంకే కూడా త్రిభాషా సూత్రం అమలును వ్యతిరేకిస్తోంది. మరోవైపు భాజపా తమిళనాడు శాఖ 'గెటవుట్ స్టాలిన్' అంటూ సీఎంకు వ్యతిరేకంగా ఆన్‌లైన్ ప్రచారాన్ని ప్రారంభించింది.

# ఉచితాలపై ఒక నియమావళి అవసరం

* **ప్రధాని, ఆర్థిక మంత్రికి దువ్వూరి సూచన**
* **ప్రజాకర్షక పథకాల విషయంలో అందరూ దోషులేనని వ్యాఖ్య**

ముంబయి: ప్రజలకు రాజకీయ పార్టీలు ఇస్తున్న ఉచితాల హామీలకు సంబంధించి, రాష్ట్రాలతో కలిసి ఒక నియమావళి రూపొందించాలని ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు సూచించారు. అవసరానికి మించి అమలు చేస్తున్న ప్రజాకర్షక పథకాల విషయంలో ప్రతి రాజకీయ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్రం కూడా దోషులేనని ఆయన అన్నారు. ఈ ఉచితాల కోసం ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయని.. ఇలా ఎంతో కాలం కొనసాగదని అభిప్రాయపడ్డారు. 'మూడేళ్ల కిందట ఉచితాలకు వ్యతిరేకంగా ప్రధాని మోదీ మాట్లాడారు. ఆ తర్వాత రెండు వారాలకే ఉత్తరప్రదేశ్‌లో భాజపా భారీ స్థాయిలో ఉచితాలను ప్రకటించింది. మిగిలిన పార్టీలూ ఇంతే. జీఎస్‌టీ, ఎఫ్‌ఆర్‌బీఎమ్ (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ యాక్ట్)ల విషయంలో కేంద్రంరాష్ట్రాల మధ్య ఉన్న సహకారం తరహాలోనే.. ఉచితాల నియమావళిపైనా రాష్ట్ర ప్రభుత్వాలతో ప్రధాని, ఆర్థిక మంత్రి



చర్చలు చేపట్టాల్సిన అవసరం ఉంద'ని శుక్రవారమిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో దువ్వూరి సూచించారు.

**అప్పులు భారీగానే ఉన్నాయ్..**

'మన రుణాలు, జీడీపీ నిష్పత్తి 80 శాతంలోపే ఉందని.. ఇది ఇతర దేశాలతో పోలిస్తే చాలా తక్కువని అంటుంటారు. అయితే అది తప్పు. మనకు ప్రాథమిక లోటు ఉన్నంత కాలం, అప్పుల భారం అధికంగా ఉన్నట్లే. ఇప్పటికీ కేంద్రం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాల వ్యయాల్లో అతిపెద్ద భాగం వడ్డీ చెలింపులకే పోతోంది. భారీ అప్పుల వల్లే ఇలా జరిగింది. అప్పులు మనల్ని కిందకు లాగుతాయి. విద్యా రుణమిస్తే.. ఒక వ్యక్తి వృత్తిపర జీవితం మొదలుపెట్టాక.. దానిని తీర్చేస్తాడు. కానీ ప్రభుత్వాలిచ్చే నగదు కేవలం వినియోగానికే ఉపయోగపడుతుంది మినహా, ఎటువంటి ప్రయోజనమూ ఉండద'ని దువ్వూరి వివరించారు.

## అమెరికాలో దొంగతనం కేసు: రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శించారు. అదానీ వ్యవహారం వ్యక్తిగత విషయం కాదు, మొత్తం దేశానికి సంబంధించిన అంశమని ఆయన తన రాయ్‌బరేలీ నియోజకవర్గ సందర్శన రెండో రోజైన శుక్రవారం లాల్‌గంజ్ ప్రాంతంలో కొందరు యువకులతో మాట్లాడుతూ అన్నారు. ప్రధాని మోదీ ఇటీవలి అమెరికా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ అదానీ వ్యవహారం వ్యక్తిగతమని, అలాంటి విషయాలు ఇద్దరు ప్రపంచ నేతలు మాట్లాడుకునేటప్పుడు ప్రస్తావనకు రావని చెప్పిన విషయం విదితమే. అదానీకి వ్యతిరేకంగా నమోదైన అవినీతి, దొంగతనం కేసులు అమెరికాలో పెండింగ్‌లో ఉన్నాయని రాహుల్ ఈ సందర్భంగా తెలిపారు. మరోవైపు 2027లో జరగనున్న యూపీ ఎన్నికలకు సిద్ధం కావాలని రాహుల్ తన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## దేశానికి ప్రపంచస్థాయి నాయకులు అవసరం

దిల్లీ: దేశానికి ప్రతిరంగంలో ప్రపంచస్థాయి శక్తిసామర్థ్యాలున్న నాయకుల అవసరం ఉందని ప్రధాని మోదీ శుక్రవారం అన్నారు. భారత ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రపంచస్థాయి పరిష్కారం చూపగల సత్తా వారికి ఉండాలని స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్ (సోల్) నిర్వహించిన సదస్సులో ఆయన పేర్కొన్నారు. దేశానికి శక్తి సామర్థ్యాలున్న నాయకులు.. బ్యూరోక్రసీ, వ్యాపారం, విధాన నిర్ణయం సహా అన్ని రంగాల్లో అవసరమున్న ప్రస్తుత తరుణంలో సోల్ లాంటి సంస్థలు దేశానికి విజయాన్ని అందించగలవని మోదీ అన్నారు. స్థానికంగా ఎదిగి ప్రపంచ స్థాయి ఆలోచనా విధానం కలిగిన నాయకులు భారత్‌కు కావాలన్నారు. దేశం ప్రపంచ శక్తి కేంద్రంగా ఎదుగుతున్న ఈ తరుణంలో దేశ దార్శనికతకు అద్దం పట్టే నాయకులు వెలుగులోకి రావాలన్నారు. వర్ధమాన రంగాలైన డీప్‌టెక్, అంతరిక్షం, బయోటెక్, సంప్రదాయేతర ఇంధనం వంటి రంగాలతో పాటు సంప్రదాయ రంగాలైన క్రీడలు, వ్యవసాయం, ఉత్పత్తి, సామాజిక సేవా రంగాల్లోనూ నాయకత్వాన్ని తయారు చేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. జాతి నిర్మాణానికి మానవ వనరుల అభివృద్ధి ఎంతో కీలకమని పేర్కొంటూ వికసిత భారత్ ఆవిష్కారానికి మెరుగైన పౌరులను తయారు చేసుకోవడం ఆవశ్యకమన్నారు.

## ట్రంప్ ఎజెండాకు సెనెట్‌లో తీవ్ర వ్యతిరేకత

(మొదటిపేజీ తరువాయి)

మున్ముందు సెనెట్, ప్రతినిధుల సభలలో ట్రంప్ ఎజెండా ముందుకు సాగడం అంత సులభం కాదన్న సంకేతాలు స్పష్టంగా కనిపించాయి. ముఖ్యంగా మస్క్ నేతృత్వంలోని డోజ్‌పై, ఉక్రెయిన్ అంశంలో అమెరికా అనుసరిస్తున్న వైఖరిపై సెనెటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం రాత్రంతా బడ్జెట్ తీర్మానంపై చర్చ జరిగింది. ''ప్రజల జీవితాలను మరింత నాశనం చేయడానికి మమ్మల్ని ఇక్కడకు పంపలేదు. కానీ ట్రంప్, మస్క్ అదే చేస్తున్నారు'' అని చర్చను ప్రారంభిస్తూ సెనెటర్ పాటీ ముర్రే పేర్కొన్నారు. ఫెడరల్ ప్రభుత్వ సిబ్బందిని తగ్గించే ప్రయత్నంలో మస్క్ నేతృత్వంలోని 'డోజ్' చాలా కుటుంబాలను నాశనం చేస్తోందని మరో సెనెటర్ జెఫ్ మెర్కిలీ ఆరోపించారు. అటవీ సేవల్లో ఉన్న ఫెడరల్ సిబ్బందిని తొలగించడంపై సెనెటర్ మైకెల్ బెన్నెట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఈ మేరకు సవరణ కూడా ప్రతిపాదించారు. రష్యాతో పోరులో ఉక్రెయిన్‌కు మద్దతు ఇవ్వాలని సెనెటర్ జాక్ రీడ్, జీన్ షహీన్‌లు కోరారు. కానీ ఈ సవరణలు ఆమోదం పొందలేదు. సుదీర్ఘంగా జరిగిన చర్చలో డెమోక్రాట్లు మొత్తం 33 సవరణలను ప్రతిపాదించారు. ఇవన్నీ వీగిపోయాయి. 340 బిలియన్ డాలర్లలో సింహభాగం సరిహద్దుల్లో వలసలకు అడ్డుకట్ట వేయడానికి, అమెరికామెక్సికో మధ్య గోడ నిర్మాణానికి వినియోగిస్తామని రిపబ్లికన్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు తీర్మానంపై ఓటింగ్ ముగిసింది. డెమోక్రాట్లతో కలిసి రిపబ్లికన్ సెనెటర్ రాండ్ పాల్ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశారు.

## చైనాలో కొవిడ్ మాదిరి కొత్త వైరస్ గుర్తింపు!

(మొదటిపేజీ తరువాయి)

శాస్త్రవేత్తలు భాగస్వాములుగా ఉన్నారు. ఈ పరిశోధనకు సంబంధించిన పరిశోధనా పత్రం 'సెల్' జర్నల్‌లో సమీక్షకు ఉంచినట్లు కథనంలో పేర్కొన్నారు. ఈ వైరస్ మెర్బెకోవైరస్‌తోపాటు ప్రాణాంతక మెర్స్‌కోవ్ (మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్) ఉప రకానికి చెందినదిగా పరిశోధకులు గుర్తించారు. ఇది హెచ్‌కేయూ5 కరోనా వైరస్ సంతతికి చెందినదిగా పేర్కొన్నారు. ఈ వైరస్‌ను తొలుత హాంకాంగ్‌లోని జపనీస్ పిపిస్ట్రెల్ రకం గబ్బిలాల్లో గుర్తించారు. తాజా పరిశోధన ప్రకారం.. HKU5CoV2 నేరుగా లేదా మాధ్యమజీవుల ద్వారా మనుషులకు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ వైరస్ సామర్థ్యం కొవిడ్19తో పోలిస్తే తక్కువేనని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

## ఇజ్రాయెల్ బస్సుల్లో వరుస పేలుళ్లు

* **ఎవరికీ గాయాలు కాలేదన్న అధికారులు**
* **పాలస్తీనా మిలిటెంట్లపైనే అనుమానం**

టెల్ అవీవ్: వరుస బాంబు పేలుళ్లు ఇజ్రాయెల్‌ను కుదిపేశాయి. బెట్ యామ్ సిటీలో ఆగి ఉన్న మూడు బస్సుల్లో బాంబులు పేలాయి. ఇది ఉగ్రవాదుల పనేనని అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. గురువారం సాయంత్రం బెట్ యామ్ పార్కింగ్ ప్రదేశంలోని మూడు బస్సుల్లో పేలుళ్లు జరిగాయి. మరో రెండు బస్సుల్లో పేలుడు పదార్థాలను గుర్తించారు. వాటిని బాంబు స్క్వాడ్ దళాలు నిర్వీర్యం చేశాయి. అనుమానితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పాలస్తీనా ఉగ్ర సంస్థలే ఈ దాడికి పాల్పడి ఉంటాయని ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి కాట్జ్ అనుమానం వ్యక్తంచేశారు. వెస్ట్‌బ్యాంక్‌లో కనుగొన్న పదార్థాలు తాజా పేలుడు పరికరాలు ఒకేలా ఉన్నాయని టెల్ అవీవ్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

**ఆ మృతదేహం షిరీ బిబాస్‌ది కాదు : ఇజ్రాయెల్**

గాజా కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా గురువారం తమకు అప్పగించిన మృతదేహాల్లో ఒకటి తమ దేశానికి చెందిన మహిళది కాదని ఇజ్రాయెల్ తెలిపింది. డీఎన్‌ఏ పరీక్షల్లో ఈ విషయం తేలిందని పేర్కొంది. 4 మృతదేహాలను గురువారం ఇజ్రాయెల్‌కు హమాస్ అప్పగించింది. ఇందులో షిరీ బిబాస్, ఆమె ఇద్దరి కుమారులు, ఓ 83 ఏళ్ల వృద్ధుడి భౌతికకాయాలు ఉన్నాయి. అయితే షిరీ బిబాస్‌కు బదులు మరో మృతదేహం అందిందని ఇజ్రాయెల్ పేర్కొంది. ఆ మృతదేహం గాజాలో బందీలుగా ఉన్న ఎవరిదీ కాదని తెలిపింది. తప్పుడు మృతదేహాన్ని అప్పగించడం కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘన కిందకే వస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఆరోపణలపై విచారణ నిర్వహిస్తామని హమాస్ తెలిపింది.

# ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం చిత్ర పటానికి పాలాభిషేకం



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : ఆర్ఎంపీ వైద్యులకు మద్దతు తెలుపుతున్న నాయకుల దిష్టిబొమ్మను తగలబెట్టడం హేయమైన చర్య అని జగద్గిరిగుట్ట ధన్వంతరి అనుభవ వైద్యుల సంఘం అధ్యక్షులు వంగరీ విష్ణు అన్నారు. తెలంగాణ ఉద్యమ రథసారథి, జేఏసీ చైర్మన్, తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం దిష్టిబొమ్మను జూనియర్ డాక్టర్లు తగలబెట్టడాన్ని నిరసనగా శుక్రవారం ధన్వంతరి అనుభవ వైద్యుల సంఘం జగద్గిరిగుట్ట, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట చివరి బస్టాప్లో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జూడాలు ఇలాంటి దుందుడుకు చర్యలను మానుకోవాలన్నారు. మా పరిధిలో మేము ప్రాథమిక వైద్యం పేద ప్రజలకు అందిస్తూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. తాము కూడా మీ తోటి వారిమని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కొమ్ము రాము, సంఘ కోశాధికారి ఉప్పల రవికుమార్, సంఘ కన్వీనర్ హరికృష్ణ, కో కన్వీనర్ నరేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు శోభన్ బాబు,మెడికల్ అడ్వైజర్ ఆంజనేయ చారి, అడ్వైజర్ నిరంజన్ రెడ్డి, ఉపాధ్యక్షులు: నరహరి, సుప్పాల ఆంజనేయులు,జమాల్, సిద్ధిరాములు, శ్రీనివాస్, వేణు, ఆత్మరామ్, అంజన్ గౌడ్, కళ్యాణ్, రాజు,రాంప్రసాద్, దేవేందర్ తదితరుల వైద్య మిత్రులు పాల్గొన్నారు.

# ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం ఇల్లందు సబ్ డివిజన్లోని ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించారు.ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న పోలీసు అధికారులను అక్కడ ప్రజల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి అట్టి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అధికారులకు సూచించారు.సైబర్ క్రైమ్స్ పట్ల అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు.అదేవిధంగా నిషేధిత మావోయిస్టుల కదిలికలపై కూడా ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.రాబోయే ఎన్నికల దృష్ట్యా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న అధికారులు , సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పీ చంద్రభాను,టేకులపల్లి సీఐ సురేష్,ఎస్సై రతీష్ , టిఎస్ఎస్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మైకులకే పరిమితమైన సీఎం రేవంత్ రెడ్డి మాటలు

* **ప్రజల మనిషి గుమ్మడి నరసయ్య కు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి**
* **టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్**



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : ఎమ్మెల్యే అనే పదానికి పూర్తి నిర్వచనం, నిరాడంబర నిస్వార్థపరుడు, ప్రజల కోసమే తన ఐదు పర్యాయాల ఎమ్మెల్యే పదవి తో ప్రజా సేవ చేసిన గుమ్మడి నరసయ్యకు కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన అవమానం ప్రజలకు, ప్రజాస్వామ్యానికి జరిగిన అవమానమేనని టిఆర్ఎస్ రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఎర్ర గోకుల జస్వంత్ లు అన్నారు. శుక్రవారం రాజాపేట లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా పాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలు విన్నవించేందుకు ఐదు పర్యాయాలుగా శాసనసభ్యులుగా ఎన్నికైన గుమ్మడి నరసయ్య కు అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం ప్రజాపాలన ధర్మమా అని ప్రజలకు ఇచ్చే గౌరవం ఇదేనా పూర్తిగా ప్రశ్నించారు. ఇక మామూలు ప్రజలకు ఏం గౌరవిస్తారని, ఇది ప్రజా పాలన కాదని, ఈ రాష్ట్రంలో దుర్మార్గ పాలన అవినీతి పాలన గౌరవం లేని పాలన కొనసాగుతుందన్నారు. అన్నదమ్ములకేమో రెడ్ కార్పేట్లు పరుస్తుండగా, శాసనసభ్యునిగా ఎన్నికైన వాళ్లకు గౌరవం లేకుండా అవమానపరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, జిల్లా మాజీ ప్రజా ప్రతినిధుల ఫోరం అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య గౌడ్, రాష్ట్ర తాజా మాజీ సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుల గుంటి మధుసూదన్ రెడ్డి, మండల రైతు జేఏసీ కన్వీనర్ ఎర్ర గోకుల జస్వంత్, టిఆర్ఎస్ మండల పార్టీ జనరల్ సెక్రెటరీ సంధిల భాస్కర్ గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, రాజాపేట పట్టణ టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బెడిదే వీరేశం, గజ్జల రాజు, గుర్రం నరసింహులు, చింతల కోటయ్య, చింతల దాసు, కృష్ణ లు పాల్గొన్నారు.

# శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా ఫుడ్ ఫెస్ట్

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి,మగ్దూంనగర్ భగత్ సింగ్ మార్గ్ గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్ట్(2025) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ఫూడ్ ఫెస్ట్లో ట్రస్మా మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు,శ్రీ సాయి విద్యానికేతన్ చైర్మన్, కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు , కుత్బుల్లాపూర్ ట్రప్ప ప్రధాన కార్యదర్శి దయాకర్,వైష్ణవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్, పాఠశాల డైరెక్టర్ బిర్రు శోభారాణి లు పాల్గొని ప్రారంభించారు. ముందుగా ఐదవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు చేసిన ఉత్తర దక్షిణాది వంటకాలతో పాటు పలు రకాల తెలుగు సాంప్రదాయేతర వంటకాలను తిలకించి రుచిచూసి అద్భుత వంటకాలతో అదరహో.. అనిపించారని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ట్రస్మా మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు ఏ రంగంలోనైనా కష్టపడే కంటే ఇష్టపడితే కలలు సాకారం చేసుకోవచ్చని అన్నారు. ఇలాంటి ఫూడ్ ఫెస్టు ఏర్పాటుతో ఏఏ ఆహర పదార్థాలలో ఏఏ పోషక విలువలు ఉంటాయో విద్యార్థులకు తెలుస్తాయన్నారు. విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ










తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ప్రతి సంవత్సరం మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల మనోభావాలకనుగుణంగా తల్లిదండ్రులు అన్ని విధాలుగా ప్రోత్సహించాలని అప్పుడే వారు అద్భుతాలు సృష్టిస్తారన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే బోధిస్తున్నామన్నారు. విద్యతో పాటు, క్రీడలు సామాజిక విలువల గూర్చి తెలుపుతూ వారి ఉజ్వల భవితకు పునాదులు వేస్తున్నామన్నారు. ఫుడ్ ఫెస్ట్ లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు చిన్నారులు చేసిన వంటకాలను చూసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్నే ఫాతిమా, ప్రశాంతి, కృష్ణవేణి, మహేశ్వరి, సాజిత, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మాతృభాష వల్ల విజ్ఞానం వస్తుంది

* **తెలంగాణ హైయర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం...**

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : మాతృభాష వల్ల విజ్ఞానము వస్తుందని, భాష పట్ల పూర్వికుల సంస్కృతి సంప్రదాయాలు అవగాహనకు వస్తాయని తెలంగాణ హైయర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సెమినార్ హాల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మాతృభాష తల్లితో సమానమని పసికందుకు తల్లి పాలు ఎంత ముఖ్యమో విద్యార్థులకు మాతృభాష అంతే అవసరమని ఆంగ్ల భాషను నేర్చుకోవాలి కానీ మన మాతృభాషను నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. ప్రపంచంలో అన్ని భాషల ఉన్న అందులో మాతృభాష గొప్పదని అన్నారు. జాతీయ పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి మండలి సలహాదారులు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కోమటిరెడ్డి వెంకట్రెడ్డి మాట్లాడుతూ భాష సంస్కృతులు ఒక సమాజపు ఆర్థిక



పురోగి పురోభివృద్ధిని ప్రభావితం చేయగలరని ఒక జాతి సాంస్కృతికంగా పురోగతి సాధించాలంటే ప్రథమ భాషే కీలక పాత్ర అని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయన్ ముదిరాజ్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా ప్రజా సంక్షేమ అభివృద్ధి కొరకు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభు, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ డైరెక్టర్ లైన్ ప్రేమ్చంద్ మునోట్ జైన్, డాక్టర్ రవితేజ, యాస్మిన్ కౌసర్,బత్తుల హేమంత్, కళాశాల పిఆర్ఓ శ్రీకాంత్,ఎం లింగమూర్తి తో పాటు పి సమృద్ధి, ఆర్ వైష్ణవి, ఏ సృజన తో పాటు డిపార్ట్మెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధిపతి ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ, హైదరాబాద్ యూనివర్సిటీ సంస్కృత విభాగం అధిపతి ప్రొఫెసర్ అంబ కులకర్ణి, ద ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ హిందీ శాఖ అధిపతి ప్రొఫెసర్ రేఖా రాణి, మౌలానా అబ్దుల్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఉర్దూ శాఖ అధిపతి ప్రొఫెసర్ అబ్దుల్ కలాం కు లాంగ్వేజ్ ప్రొఫెషన్ ఎక్సలెన్సీ అవార్డు లు 2025 ను శాలువా మొమెంటో పూలదండ తోపాటు ప్రశంసా పత్రం తో సన్మానించి అభినందనలు తెలిపారు.

# టీయూడబ్ల్యూజే కూకట్ పల్లి అధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్ కు ఘన సన్మానం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు కూకట్ పల్లి అధ్యక్షుడిగా నియమి తులైన నిమ్మల శ్రీనివాస్ ను శుక్రవారం కూకట్ పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి గోవర్ధన్ రెడ్డి , మాజీ అధ్యక్షులు అర్చన పెల్లి ప్రకాష్ రావు, శ్రీనివాస్ రెడ్డి, అఖిలేష్ ,బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నటరాజ్ , జాయింట్ సెక్రెటరీ యాదయ్య, కోశాధికారి ఖలీల్ పాషా , మహిళా న్యాయవాద ప్రతినిధి సదాలక్ష్మి, సీనియర్ న్యాయవాదులు పరమేష్ గౌడ్, శ్రీనివాస్ సింగ్ ,ల తో పాటు పలువురు న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

# దివ్యాంగ బాలల ఉజ్వల భవిష్యత్ కు భవిత కేంద్రాలు తోడ్పాటును ఇస్తున్నాయి..

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లానందు కొత్తగూడెం రైటర్ బస్తీలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రాన్ని (భవిత ) జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సందర్శించారు. అన్ని రకాల వైకల్యాల గల పిల్లలకు కావలసిన ఉపకరణాల గురించి భవిత సిబ్బందిని అడిగి తెలుసుకోవడం జరిగింది. స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, ఆడియాలజిస్ట్ అవసరాన్ని, జిల్లాలో నిర్వహిస్తున్న సమ్మిళిత విద్యా విధానం గురించి ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ యస్. కె. సైదులు కలెక్టర్ కు వివరించారు. భవిత పాఠశాల ఆవరణలో గల పాత భవన నిర్మాణాన్ని తొలగించి వారికి ఆట స్థలం ఏర్పాటు అయ్యేలా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.తదుపరి పాల్వంచ భవిత కేంద్రాన్ని కూడా ఈ సందర్భంగా సందర్శించి దివ్యాంగ పిల్లలతో ఇంటరాక్ట్ అయి పిల్లల ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా అబ్దుల్ అజీజ్ అనే విద్యార్థి భవిత కేంద్రం లో అందించిన ఫిజియో థెరపి ద్వారా, మంచానికి పరిమితం



అయిన స్థితి నుండి స్వయంగా నిలబడి, నడవగలిగే స్థితికి వచ్చిన విద్యార్థి యొక్క సక్సెస్ స్టోరీని స్వయంగా విని కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఐటిఐ చదువుతున్న అబ్దుల్ అజీజ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కేంద్రాన్ని సందర్శించడం జరిగిందని, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తుకు సంబంధించి చర్చించడం జరిగిందన్నారు. పిల్లలు దేవుడిచ్చిన వరంగా భావించాలని, వారి నైపుణ్యాలను తీర్చిదిద్ది, స్పెషల్ స్కూల్ నుంచి నార్మల్ స్కూల్ కు మెయిన్ స్ట్రీమ్ చేయడానికి ఇక్కడున్న సిబ్బంది కృషి చేస్తున్నారని, ప్రత్యేక అవసరాల పిల్లలకు కావలసిన ఉపకరణాల గురించి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.రానున్న కాలంలో దివ్యాంగ పిల్లలకు సమ్మిళిత విద్యను భవిత కేంద్రాల ద్వారా పూర్తి స్థాయిలో అందించేందుకు చేపట్టవలసిన కార్యకలాపాలపై పక్కా ప్రణాళిక ను రూపొందించి దివ్యాంగ పిల్లలకు మంచి భవిష్యత్ ను అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాధికారి ఎం. వెంకటేశ్వర చారి , సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ యస్. కె. సైదులు, మండల విద్యాధికారి శ్రీరామ్మూర్తి, రిసోర్స్ పర్సన్ లు శ్రీరామ్, కనక దుర్గా, అరుణ కుమారి, అనిత తదితరులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తును మార్చేది కమ్యూనిస్టు ప్రభుత్వంలో మాత్రమే

* **సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : దేశ భవిష్యత్తును మార్చేది, అసమానతలు లేని సమాజం కమ్యూనిస్టు ప్రభుత్వంలో మాత్రమే ఉంటుందని సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం రెడ్ బుక్ డే సందర్భంగా షాపూర్ నగర్ పార్టీ కార్యాలయంలో పార్టీ 24వ జాతీయ మహాసభ రాజకీయ తీర్మానం ముసాయిదాను, పఠనం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి విముక్తి చూపించేది ఎర్ర జెండా మాత్రమేనని అన్నారు. చదువుతూ సమాజాన్ని మార్చాలని ప్రపంచంలో దోపిడి, పీడన ,వివక్షత, అణచివేత, ఆర్థిక సమానతలు ఉన్నంతకాలం కమ్యూనిజం అజెయం గా నిలుస్తుందన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గర్జించేది కమ్యూనిస్టులేనని అన్నారు, ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు దేవదానం, పార్టీ నాయకులు మల్లారెడ్డి, ఆంజనేయులు, కే శీను, యాదవ రెడ్డి, తిమ్మప్ప, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల ప్రవేశ పరీక్ష టీజీసెట్ 2025 సర్వం సిద్ధం

రాజాపేట, ప్రజా స్ఫూర్తి : తెలంగాణ రాష్ట్రంలో 23వ తేదిన 5వ, తరగతి గురుకుల పాఠశాలలో ప్రవేశం కొరకు,ఆరవ తరగతి నుండి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం నిర్వహించే టీజీసెట్ 2025 పరీక్షకు అన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు పూర్తి అయ్యాయని చీఫ్ సూపరింటెండెంట్ వేణు ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ లో ఆయా పరీక్ష కేంద్రాల ప్రిన్సిపాల్ ఫోన్ నెంబర్స్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు . చిరునామ కొరకు విద్యార్థుల తల్లిదండ్రులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే అట్టి ఫోన్ నెంబర్ కు ఫోన్ చేయవచ్చన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ తో పాటు ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని హాల్ టికెట్లో ఏమైనా తప్పిదాలు ఉన్నట్లయితే వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో హాజరు అయినట్లయితే వాటిని సరి చేస్తారన్నారు . స్థానిక రాజపేట సాంఘిక సంక్షేమ గురుకుల ప్రవేశ పరీక్ష కేంద్రానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి కావడం జరిగిందని, విద్యార్థులందరు కూడా పూర్తి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని చీఫ్ సూపర్డెంట్ వేణు ప్రసాద్ కోరారు.

# శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : జీడిమెట్ల డివిజన్ జీడిమెట్ల గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థానం కమిటీ సభ్యులు శుక్రవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈనెల 27వ తేదిన నిర్వహించనున్న శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే ని ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో గొరిగే బాలప్ప, ఎల్లప్ప, జీతయ్య, వెంకటేష్, ఆంజనేయులు గొరిగే బాల మల్లేష్, కాలే నగేష్, కోట బాల మల్లేష్, కాలే గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్ల కళ్యాణ మహోత్సవ కరపత్రిక ఆవిష్కరణ



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్ లోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబికా సమేత శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్ల కళ్యాణ మహోత్సవ కార్యక్రమ కరపత్రికను శుక్రవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆవిష్కరించారు. అనంతరం శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్ల కళ్యాణ మహోత్సవానికి హజరు కావాలని ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భౌరంపేట్ పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, దేవాలయ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శేఖర్ ముదిరాజ్ , ఉపాధ్యక్షులు శంకరప్ప, కోశాధికారి వి. ప్రశాంత్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రామచంద్ర రెడ్డి, పాండురంగం గుప్త, నామాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ట్విన్ డే...కవల పిల్లలతో కళకళ

* **తల్లిదండ్రులకు వరం**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రతీ యేడాది రెండో నెల ఇరవై రెండవ తేదీ.... అంటే అన్నీ రెండ్లే.. మరి ఈ తేదీకి ప్రత్యేకం ఏమిటనుకుంటున్నారా... అదేనండి పుట్టేటప్పుడు ఇద్దరు కలిసి పుట్టే వారికోసం ఈ తేదీని ప్రత్యేకంగా ట్విన్స్‌డేగా జరుపుకుంటారు. ఎంతోమంది తల్లిదండ్రులు పిల్లలు లేరని బాధపడుతుంటే ఒకే కాన్పులో ట్విన్స్ పుట్టిన తల్లిదండ్రుల ఆనందాలకు అవధులు ఉండవు. ట్విన్స్ పిల్లలు వయస్సు పెరిగిన కొద్దీ కొందరి ముఖ కవలికలు వేరువేరుగా ఉన్నప్పటికీ... అధికశాతం మాత్రం ఒకే పోలికలతో ఉంటారు. ఇలా ట్విన్స్‌గా పుట్టిన వారికి ఒకేవిధమైన అలవాట్లు ఉంటాయని ఎంతోమంది తల్లిదండ్రులు వారి పిల్లల గురించి చెప్తుంటారు. ఇక తల్లిదండ్రులు ఆ ట్విన్స్‌కు



ఒకే రకమైన డ్రెస్‌లు వేస్తూ, ఇద్దరినీ ఒకే తరగతికి పంపిస్తూ సంతోషిస్తుంటారు. తల్లిదండ్రులకు మినహా మిగిలిన వారికి ఆ ట్విన్స్‌ను చూసినప్పుడు కొంత కన్ఫ్యూజన్ కూడా ఉంటుందండోయ్. ఇందులో



ఎవరిపేరు ఏమిటని కనుక్కోవడం కూడా కొన్ని సందర్భాల్లో కష్టంగానే ఉంటుంది. ఇలా ట్విన్స్ అందరూ కలిసి ఒకే దగ్గర చేరడం అరుదు. కాని కొత్తగూడెంలోని సెయింట్ మేరీస్ గర్ల్స్ హై స్కూల్‌లో



మాత్రం ఇలాంటి కవల పిల్లల జంటలు ప్రతి ఏడాది కొత్తగా చేరుతూనే ఉంటారు. అన్నట్టు ఈ రోజు ట్విన్స్‌డే జరుపుకుంటున్న కవలలందరికీ ట్విన్స్‌డే శుభాకాంక్షలు మరి.

# అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను
## బహిరంగంగా ఉరి తీయాలి

- **బేడ బుడగ జంగం`జన సంఘం రాష్ట అధ్యక్షుడు సిరిపాటి వేణు, కోశాధికారి డొక్కా రాజేష్**
- **మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వత్తుల నివాళి**



ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల: కర్ణాటక రాష్ట్రం యాదగిరి మండలం గురుమిట్టల్ ఇంద్రనగర్‌లో బేడ బుడగ జంగాలకు చెందిన ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసి, హత్య చేసిన 6 గురు నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని బేడ బుడగ జంగం`జన సంఘం రాష్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు, కోశాధికారి డొక్కా రాజేష్ కర్ణాటక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్ణాటకలో బేడ బుడగ జంగాలకు చెందిన ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటన ఖండిస్తూ బేడ బుడగ జంగం`జన సంఘం రాష్ట్ర కోశాధికారి డొక్కా రాజేష్, జిల్లా నాయకులు హనుమంతు ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వత్తులతో శుక్రవారం నివాళి అర్పించారు. ముందుగా ర్యాలీ చేపట్టి అత్యాచారం ఘటనను తీవ్రంగా ఖండిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. తదనంతరం వారు మాట్లాడుతూ సంచార జాతి బేడ బుడగ జంగాలకు చెందిన ఇద్దరు మహిళలపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన చాలా బాధాకరమని, ఆరుగురు కామాంధులు వారి కామ కాంక్ష తీర్చుకునేందుకు ఇద్దరు మహిళలను బలి చేయడం, ఆపై హత్య చేసి చెరువులో పడేయడం అమానుషమని అన్నారు. దేశంలో రోజు రోజుకు మహిళలపై ఇలాంటి అఘాత్యాలు పెరిగిపోతున్నాయని అన్నారు. మహిళలకు పూర్తిగా రక్షణ కరువవుతుందని అన్నారు. మానవ మృగాలు పెట్రేగిపోతూ చిన్న పిల్లల నుంచి వృద్ధ వయస్సులో ఉన్న మహిళలపై వరకు ప్రతీ రోజూ ఏదో ఒక చోట లైంగిక వేధింపులకు పాల్పడటం, అత్యాచారాలు, ఆపై హత్యలు చేయడం వల్ల సభ్య సమాజం తలదించుకుంటుందని అన్నారు. ఎన్ని చట్టాలు వచ్చినప్పటికీ ఇలాంటి అత్యాచారాలు ఆగకపోవడం బాధాకరమని అన్నారు. ఇద్దరు మహిళలను అత్యాచారం చేసి, హత్య చేసి చెరువులో పడేసిన నిందితులను వెంటనే బహిరంగంగా ఉరి తీయాలని, అప్పుడే ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతంగా కాకుండా ఉంటాయని అన్నారు. అత్యాచారం, హత్యకు గురైన ఇద్దరు మహిళల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, సంచార జాతికి చెందిన బేడ బుడగాల మహిళల రక్షణ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్, కిష్టయ్య, మైసయ్య, దుర్గయ్య, తిరుపతి, బాల కిషన్, సతీష్, వెంకటేష్, నర్సింలు, సంపత్, గంగారం తదితరులున్నారు.

# ఔత్సాహిక టెక్కీలకు టీటా ఆహ్వానం

* **ఉత్సాహవంతులైన వారికి సభ్యత్వ ఆహ్వానం పలికిన టీటా**
* **2025 నూతన కమిటీలకు నామినేషన్ల ప్రక్రియ షురు**



యాదాద్రి భువనగిరి , (ప్రజాస్ఫూర్తి) : తెలుగు రాష్ట్రాలతో పాటుగా భారతదేశంలోని ముఖ్యనగరాలు, ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో విస్తరించిన తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) తమతో కలిసి నడిచే వారి కోసం నూతన సభ్యత్వ ఆహ్వానం అందిస్తోంది. గ్లోబల్ కమిటీ సభ్యత్వం కోసం ఔత్సాహికులకు ఆహ్వానాన్ని ప్రకటించింది. టీటాకు చెందిన గ్లోబల్ కమిటీ 20215 కాలపరిమితి ఈ మార్చి 31తో ముగియనున్న నేపథ్యంలో ఈ సభ్యత్వ కార్యక్రమం చేపడుతూ ఐటీ ఆధారిత వ్యక్తులు లేదా వ్యాపారసంస్థలు చేరవచ్చని వివరించింది. ఈ మేరకు టీటా గవర్నింగ్ కౌన్సిల్ నేడొక ప్రకటన విడుదల చేసింది. ఐటీ ఉద్యోగులు, కార్పొరేట్ మెంబర్‌షిప్, ఎన్నారైలు, విద్యార్థులు, అసోసియేట్ సభ్యులు, ఐటీ ఫ్యాకల్టీ, ప్రభుత్వ రంగం నుంచి ఐటీ విభాగంలో ఉన్నవారు సభ్యులుగా చేరవచ్చని వివరించింది. టీటా గ్లోబల్ కమిటీ ప్రస్తుత బృందం కాలపరిమితి ముగుస్తున్న నేపథ్యంలో 2025 కాలపరిమితికి చెందిన నూతన కమిటీకి సభ్యత్వాలను ఆహ్వానిస్తూ గవర్నింగ్ కౌన్సిల్ ప్రకటన వెలువరించింది. గ్లోబల్ కమిటీ సభ్యులు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కమిటీలు, జిల్లా కమిటీలకు సైతం ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని ఔత్సాహికులకు సభ్యత్వం విషయంలో సహాయ సహకారాలు అందించాలని సూచించింది. ఔత్సాహికులు bit.ly/joinTITA లింక్ ద్వారా సభ్యులుగా చేరవచ్చు. నామినేషన్లు పంపేవారు bit.ly/tita_nomination లింకులో ప్రతిపాదించవచ్చు. మరిన్ని వివరాలకు TelanganaIT@gmail.com ఈమెయిల్‌ను లేదా 8019577575 ను సంప్రదించవచ్చు.ఈ సందర్భంగా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ కుమార్ మఖ్తల మాట్లాడుతూ తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ రాష్ట్ర ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించడంతో పాటుగా తెలంగాణ ఏర్పడిన అనంతరం ప్రత్యేక రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తన వేదిక ద్వారా చేపట్టిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పలు కార్యక్రమాల్లో పాలుపంచుకొని వాటిని విజయవంతం చేసిందని వివరించారు. సాంకేతిక అక్షరాస్యత కోసం గ్రామాలను దత్తత తీసుకోవడం, నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడం కోసం డిజిథాన్ కార్యక్రమం చేపట్టడం, ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు ఇంక్యుబేషన్ సెల్ ఏర్పాటు సహా అనేక ప్రక్రియలతో తెలంగాణ రాష్ట్ర చరిత్రలో టీటా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని ఆయన వివరించారు. టీటా కృషిని చూసి దేశవిదేశాల్లో సైతం వివిధ శాఖలు ఏర్పాటు అయ్యాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో సమాజహితం కోసం సమయాన్ని కేటాయించి ముందుకు వచ్చే ఆసక్తి ఉన్నవారు, బాధ్యతగా భావించి పనిచేసే వారు సభ్యత్వ నమోదు చేసుకోవచ్చునని వివరించారు.

# మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

* **కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్ , (ప్రజాస్ఫూర్తి) : మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. మహా శివరాత్రి మహోత్సవం సందర్భంగా సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీకి చెందిన శ్రీశ్రీశ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాద పూర్వకంగా కలిసి ఈనెల 24వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న మహాశివరాత్రి మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ స్వామి వారి కృపా కటాక్షములతో ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నారు. మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించడంలో నా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి చందు, ప్రభాకర్, నాగరాజు పటేల్, నరేష్, మహేష్, వైభవ్, పవన్, శశి కిరణ్ తదితరులు పాల్గొన్నారు

# డిజిటల్ క్రాఫ్ట్ సర్వే తో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఏఈఓ లు

* **సమస్యలు పట్టించుకోకుండా వేగం పెంచాలంటున్న అధికారులు**

రాజపేట, ప్రజా స్ఫూర్తి : వ్యవసాయ శాఖలో ఏఈఓ లకు డిజిటల్ క్రాఫ్ సర్వే అనేక ఇబ్బందులను కొని తెస్తూ ఉద్యోగం భారంగా మారింది. ఒక్కొక్క ఏఈఓ కు 10000 ఎకరాల సర్వే టార్గెట్ ఇవ్వడం సమస్యలు పట్టించుకోకపోవడం పనిలో వేగవంతం చేయాలని అధికారులు చెప్పడం ఏఈఓ లకు ఉద్యోగం శాపంగా మారింది. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు సర్వే కోసం సిగ్నల్ లేని ప్రాంతాలలో ట్యాబ్ లేకుండా సొంత సెల్ ఫోన్లలో సర్వే చేయడం లాంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల దారులు లేకపోవడం నిర్మానుష్యంగా ప్రాంతం ఉండడంతో సెక్యూరిటీ సమస్యను ఎదుర్కొంటున్నారు. సంబంధిత గ్రామ శాఖ కార్యదర్శిని గాని ఎవరైనా ఉద్యోగిని తోడుగా ఏర్పాటు చేస్తే కొంత మేరకు సర్వేలో ఇబ్బందులు తగ్గుతాయని భావిస్తున్నారు. ఇలా అనేక సమస్యలను ఎదుర్కొంటున్న ఏఈవోల సూచనలు సలహాలు తీసుకోకుండా సర్వేలో ఎదురవుతున్న సమస్యలను పట్టించుకోకుండా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఏ ఈ ఓ లు ఫీల్డ్ మీదికి వెళ్లిన తర్వాత ఆప్ సరిగా పనిచేయకపోవడంతో పంటల నమోదును చేయలేకపోతున్నారు. మహిళ ఏఈవోలు ముఖ్యంగా కొన్ని డి సి ఎస్ లో ఇచ్చిన కొన్ని సర్వే నెంబర్లు నిర్మాణస్య ప్రదేశాలుగా ఉండడం వలన సహాయకులు లేకపోవడం వలన వెళ్లడానికి భయపడుతున్నారు. డిపార్ట్మెంట్ ఇచ్చిన ట్యాబులు అన్నీ కూడా పనిచేయడం లేదు అందువలన ఫోన్లో డిసిఎస్ గంటలకు కొద్ది ఆన్లైన్ చేయడం వలన ఫోన్లోచార్జింగ్ లేకపోవడం వలన డి సి ఎస్ సర్వే సరిగా చేయలేకపోతున్నారు. డీసీఎస్ సర్వే కోసం వెళ్లిన ప్రదేశంలో ఫోన్ సిగ్నల్స్ సరిగా రాకపోవడం వలన, ప్రస్తుత పరిస్థితులలో రైతుల నుండి రుణమాఫీ రైతు భరోసా సంబంధించిన ఫోన్ కాల్స్ అధికంగా రావడం వలన ఏఈవోలు సరిగ్గా డిసిఎస్ సర్వే లో పంట నమోదు సరిగ్గా చేయలేకపోతున్నారు. ఏవోలు డిసిఎస్ లో చూపించిన సర్వే నెంబర్లోకి వెళ్లిన తర్వాత రైతుల యొక్క వేసిన పంటను డీసీఎస్ అప్ లో అప్లోడ్ చేయాలి. కాబట్టి సబ్ సర్వే నెంబర్లు గుర్తించడం కష్టంగా ఉంది. ఇలా అనేక సమస్యలను ఏవోలు ఎదుర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తగు సూచనలు ఇవ్వాల్సి ఉంది.

# 68 కిలోల బంగారం.. 55 అడుగుల స్వర్ణ విమాన గోపురం

* **యాదగిరిగుట్టలో రేపే ఆవిష్కరణ కార్యక్రమం**

నల్గొండ , యాదగిరిగుట్ట: యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం పంచకుండాత్మక నృసింహ మహాయాగం నిర్వహించి దివ్య స్వర్ణ విమాన గోపురాన్ని స్వామివారికి అంకితం చేయనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. వానమామలై మఠం పీఠాధిపతి మధురకవి రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహా సంప్రోక్షణకు 40 జీవ నదుల జలాలు సేకరించారు. ఆదివారం ముగింపు కార్యక్రమం సందర్భంగా గుట్ట కింద సత్రాల్లో లక్ష మందికి ఉచిత పులిహోర ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.



# ఒక్క రోజు కాలేదు.. అప్పుడే విమర్శలా? ఢిల్లీ సీఎం

ఢిల్లీ: భాజపా ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేదంటూ ఢిల్లీ మాజీ సీఎం ఆతిశీ చేసిన విమర్శలను కొత్త సీఎం రేఖా గుప్తా తిప్పికొట్టారు. "కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 13 ఏళ్లు ఢిల్లీని పాలించాయి. ఇన్నేళ్లపాటు మీరేం చేశారో చూసుకోకుండా.. అధికారంలోకి వచ్చి ఒక్కరోజు కూడా కానీ మాపై విమర్శలు చేస్తారా..? మొదటిరోజే మేం క్యాబినెట్ సమావేశం జరిపాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయుష్మాన్ భారత్ యోజనను అందుబాటులోకి తీసుకువచ్చాం. దాంతో ప్రజలకు రూ.10లక్షల మేర వైద్యసహాయం అందనుంది. ఈ పథకాన్ని ఆప్ అమలు చేయలేదు. మమ్మల్ని ప్రశ్నించే హక్కు వారికి లేదు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఢిల్లీ తన హక్కులన్నీ పొందుతుంది. ముందు మీరు మీ పార్టీ గురించి చూసుకోండి. ఎంతోమంది మీ పార్టీని వీడాలని చూస్తున్నారు. కాగ్ రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెడితే అందరి జాతకాలు బయటపడతాయని ఆందోళన చెందుతున్నారు" అని రేఖ దుయ్యబట్టారు. ఢిల్లీలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థికసాయం అందించే పథకాన్ని మొదటి క్యాబినెట్ సమావేశంలో ఆమోదిస్తామని భాజపా హామీ ఇచ్చిందని, కానీ మొదటిరోజే దానిని ఉల్లంఘించిందని ఆతిశీ విమర్శించారు. దీనిపైనే



సీఎం స్పందన వచ్చింది. నిన్న రామ్‌లీలా మైదానంలో భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో ఢిల్లీ 9వ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. ప్రమాణ కార్యక్రమం ముగిసిన వెంటనే ఆమె సచివాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 నాటికి అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలవారీ ఆర్థిక సహాయం రూ.2,500 జమ చేస్తామని తెలిపారు. ఢిల్లీ అభివృద్ధి కోసం ఒక్కరోజు కూడా వృథా చేయకుండా శ్రమిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ రిపోర్టులను అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే సభలో ప్రవేశపెడతామని చెప్పారు. ఆమె అధ్యక్షతన ఢిల్లీ సచివాలయంలో గురువారం రాత్రి 7 గంటల సమయంలో తొలి మంత్రివర్గ భేటీ జరిగింది. అనంతరం మంత్రులందరితో కలిసి యమునా ఘాట్ వద్దకు వెళ్లి హారతి నిర్వహించారు.

## శరద్ పవార్ కూర్చోవడానికి సాయం చేసి.. నీళ్లిచ్చిన ప్రధాని మోదీ

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 98వ అఖిల భారత మరాఠీ సాహిత్య సమ్మేళనంలో ఆసక్తికర ఘటన జరిగింది. విజ్ఞాన్ భవన్ వేదికగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ నడుమ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. శరద్ పవార్ కుర్చీలో కూర్చోవడానికి మోదీ సాయం చేయడంతో పాటు, తన చేతితో స్వయంగా గ్లాసులో నీళ్లు నింపి పవార్‌కు అందించారు. దీంతో అక్కడున్న వారంతా చప్పట్లతో హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ పాల్గొన్నారు. మరాఠీ భాషకు కొన్ని నెలల క్రితం కేంద్రం శాస్త్రీయ భాష హోదా కల్పించింది. ఈ నేపథ్యంలో




దాదాపు 71 ఏళ్ల తర్వాత ఢిల్లీ వేదికగా రెండోసారి ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. తొలిసారి జవహర్‌లాల్ నెహ్రూ ఢిల్లీలో మరాఠా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శరద్ పవార్.. మోదీని ప్రశంసించారు. కార్యక్రమానికి ఆహ్వానించినప్పుడు వెంటనే కాదనకుండా అంగీకరించారని తెలిపారు. మరాఠీకి ఉన్నత భాష హోదా ఇవ్వడంలో ప్రధాని మోదీ పాత్ర కీలకం అంటూ కొనియాడారు. తన ప్రసంగం ముగించుకుని వచ్చి కుర్చీలో కూర్చొనే క్రమంలో ఈ అరుదైన సన్నివేశం చోటు చేసుకుంది.

## 'నన్ను తేలిగ్గా తీసుకోవద్దు'

- ఏక్‌నాథ్ శిందే

మహారాష్ట్రలోని అధికార మహాయుతి కూటమిలో విభేదాలు తీవ్రమయ్యాయని ఊహాగానాలు వినిపిస్తున్న వేళ డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే కీలక వ్యాఖ్యలు చేశారు. తనను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సమావేశాలకు ఇటీవల దూరంగా ఉంటున్న శిందే.. 2022లో ప్రభుత్వాన్ని పడగొట్టిన విషయాన్ని తాజాగా మరోసారి ప్రస్తావించారు. శిందే హయాంలో ఆమోదించిన ఓ ప్రాజెక్టును ఫడణవీస్ ప్రభుత్వం నిలిపివేసిన నేపథ్యంలో శివసేన నేత ఈ విధంగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది. "నేను ఓ సాధారణ పార్టీ కార్యకర్తను. అంతేకాదు బాబాసాహెబ్ అడుగుజాడల్లో నడిచిన వ్యక్తిని. ప్రతి ఒక్కరు దీన్ని అర్థం చేసుకోవాలి. 2022లో అందరూ నన్ను తేలిగ్గా తీసుకున్నప్పుడు.. నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని పడగొట్టా'' అని మీడియా ముందు ఏక్‌నాథ్ శిందే పేర్కొన్నారు. అనంతరం విధానసభలో చేసిన మొదటి ప్రసంగంలో దేవేంద్ర ఫడణవీస్‌కు 200కంటే ఎక్కువ సీట్లు వస్తాయని చెప్పానని, 232 సీట్లు వచ్చాయన్నారు. అందుకే తనను తేలిగ్గా తీసుకోవద్దని, ఇది ఎవరిని ఉద్దేశించి చెబుతున్నానో వాళ్లు అర్థం చేసుకుంటారని అన్నారు. మహారాష్ట్రలో భాజపా-శివసేన-ఎన్సీపీల మహాయుతి కూటమి ప్రభుత్వాన్ని



ఏర్పాటు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా 132 స్థానాల్లో విజయం సాధించగా.. శివసేన 57, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 41 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అయితే, కూటమిలో విభేదాలు వచ్చాయంటూ కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సమావేశాలకు డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే హాజరుకావడం లేదని సమాచారం. శిందే వర్గం ఎమ్మెల్యేలకు భద్రతను తొలగించడంతోపాటు సచివాలయంలో వైద్య సహాయ కేంద్రాలను ఇద్దరు వేర్వేరుగా ఏర్పాటు చేసుకోవడం కూడా వీరిమధ్య మరింత దూరాన్ని పెంచినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలపై ఇటీవల స్పందించిన శిందే.. ముఖ్యమంత్రితో ఎటువంటి కోల్డ్ వార్ లేదని, అభివృద్ధిని అడ్డుకునే వారితోనే తన పోరాటమని చెప్పారు. తాజాగా తనను తేలిగ్గా తీసుకోవద్దంటూ ప్రత్యర్థులకు హెచ్చరికలు చేయడం గమనార్హం.

## డిస్కౌంట్లు ఇస్తూ పోతే.. ఆర్టీసీని నడపడం కష్టమే : మహారాష్ట్ర రవాణా మంత్రి

ఛత్రపతి శంభాజీనగర్: మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు, 75 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇస్తోన్న రాయితీలతో తమ సంస్థకు రోజూ రూ.3 కోట్ల మేర నష్టం వస్తోందన్నారు. ధారాశివ్‌లో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్టీసీ కొత్తగా డిస్కౌంట్లు ఇచ్చే విషయంపై ఆలోచించడం అసాధ్యంగా మారిందన్నారు. బస్సు ఛార్జీల్లో మహిళలకు 50 శాతం డిస్కౌంట్, 75 ఏళ్లు పైబడిన వృద్ధులకు రాయితీ ఇవ్వడం వంటి పథకాలతో ఆర్టీసీకి రోజూ రూ.3 కోట్ల నష్టం



వాటిల్లుతోందని పేర్కొన్నారు. ఇలా రాయితీలు ఇచ్చుకుంటూ పోతే ఆర్టీసీని నడపడమే కష్టమవుతుందని వ్యాఖ్యానించారు.

## పరీక్షల్లో 'చీటింగ్' వివాదం.. తుపాకులతో కాల్పులు, విద్యార్థి మృతి

పదో తరగతి పరీక్షల్లో చీటింగ్ జరిగిందంటూ వచ్చిన ఆరోపణలు విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీశాయి. దీంతో రెచ్చిపోయిన విద్యార్థులు ఏకంగా తుపాకులతో కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలు కాగా.. అందులో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందాడు. బిహార్‌లోని రోహ్‌తాస్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. రోహ్‌తాస్‌లోని సాసారామ్ పట్టణంలో నిర్వహించిన పదోతరగతి పరీక్షల్లో చీటింగ్ జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. వీటికి సంబంధించి ఫిబ్రవరి 19న విద్యార్థుల మధ్య వివాదం చోటుచేసుకుంది. మరుసటి రోజూ గ్రూపులుగా విడిపోయిన విద్యార్థులు భౌతిక



దాడులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత విద్యార్థి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మృతదేహంతో జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. సాసారామ్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దీంతో భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. అటు విద్యార్థులు చికిత్స పొందుతున్న స్థానిక మెడికల్ కాలేజీ ఆసుపత్రి వద్ద కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## భారత ప్రధాని మోదీ నాకు పెద్దన్న: భూటాన్ ప్రధాని

భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకు పెద్దన్న వంటి వారని భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గే అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన 'సోల్' లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో పాల్గొని ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో నాయకత్వం గురించి ఏమీ తెలిసేది కాదని.. అందుకు తాను అర్హుడిని కాదని అనుకునేవాడినని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ పర్యటనకు ఓ విద్యార్థిగా వచ్చానని అన్నారు. దీనిద్వారా ప్రపంచంలోనే గొప్ప నేతగా పేరొందిన నరేంద్రమోదీ నుంచి నాయకత్వ పాఠాలు నేర్చుకొనే అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తంచేశారు. ఇది తనకు దొరికిన గొప్ప సదావకాశమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞత, ధైర్యం, ముందుచూపుతో కేవలం పదేళ్లలో భారతదేశాన్ని ప్రగతిపథంలో నడిపించారని అన్నారు. ప్రస్తుతం ప్రపంచదేశాలు భారత్ వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. నాయకత్వం అనేది కేవలం బిరుదుల్లో ఉండదని.. వారు చూసే దృష్టికోణంలో ఉంటుందని అన్నారు. చరిత్ర కూడా ఇదే చెబుతోందని అన్నారు. ప్రపంచంలో గొప్ప నాయకులుగా పేరుపొందిన వారు కేవలం ఒక సంస్థకు లేదా దేశానికి మాత్రమే నాయకత్వం వహించలేదని.. ఓ విప్లవం, అభివృద్ధికి నాయకత్వం వహించారని అన్నారు. సరైన నాయకులు తమ దేశాన్ని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకువెళ్లగలరని.. అటువంటి నాయకుడే ప్రధాని మోదీ అని ప్రశంసలు కురిపించారు.





# సోయా క్యాండిల్ ఎంత స్పెషల్ అంటే..!

**పుట్టిన రోజు, పండుగలు, ప్రత్యేక ఫంక్షన్లు ఇలా సందర్భంతో సంబంధం లేకుండా క్యాండిల్ వెలిగించడం పరిపాటి. చాలా వరకూ కరెంట్ పోయినప్పుడు కూడా కొవ్వొత్తి వెలిగిస్తాం. కానీ ప్రత్యేకంగా వెలిగించే క్యాండిల్స్ విషయానికి వస్తే వీటిలో బోలెడు రకాలున్నాయి. సోయా క్యాండిల్స్, సెంట్ సువాసనలతో రూమ్ అందాన్నే కాదు, ఆహ్లాదకరమైన సువాసనతో మనసును తేలికచేసేస్తాయి. ఖరీదులో కూడా మన క్యాండిల్స్‌కి కాస్త దగ్గరలోనే ఉంటాయి. ఈ చిన్న జార్స్ క్యాండిల్స్ చూసేందుకు ముచ్చటగా, ముద్దుగా ఉంటాయి. వీటి గురించి మరింత తెలుసుకుందాం.**

సోయా మైనం అనేది సోయాబీన్ మొక్కల నుంచి సేకరించిన స్వచ్ఛమైన సహజమైన మైనం. ఇది మానవ శరీరానికి హాని కలిగించని విధంగా ఉంటుంది. ధర కూడా తక్కువ, రంగు కూడా మారదు. ఈ కొవ్వొత్తుల సువాసనలు అరోమా థెరపీ, రిలాక్సేషన్, ఒత్తిడిని తగ్గించడం, ధ్యానం, మూడ్ పీస్ కోసం సరిగ్గా సరిపోతాయి.

ఇది దోమలు, యాంటీ బాక్టీరియల్, పురుగులను తిప్పి కొడుతుంది. చిరాకు నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. ఒత్తిడి, నిద్రలేమి, తలపోటు నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. దీనితో ఎలాంటి శ్వాసకోశ, నాసికా అలెర్జీలు, ఆస్తమా ఇతర సమస్యలు రావు. ఈ కొవ్వొత్తి వెలిగించినప్పుడు పొగ రాదు.

సోయా కొవ్వొత్తులు మామూలుగా మనం వాడే కొవ్వొత్తులకు వీటికీ మధ్య ఏం తేడా ఉంటుంది అన్నీ ఒకటే కదా అనుకోవచ్చు. ఈ కొవ్వొత్తులు మసిని ఇవ్వవు. జంతు ఉత్పత్తులతో తయారు చేసిన కొవ్వొత్తుల కంటే సోయా కొవ్వొత్తులు ఎక్కువ సేపు ఉంటాయి.

ఇవి అందం విషయంలో పారాఫిన్ కొవ్వొత్తుల కంటే అందంగా ఉంటాయి. వీటిని అందమైన ఆకారాల్లో బహుమతుల్లా తయారుచేస్తారు. గిఫ్ట్ ఐటమ్స్ కింద కూడా ఇచ్చుకోవచ్చు. సోయా కొవ్వొత్తిని స్టైల్‌కు తగినట్టుగా మార్చుకోవచ్చు.

**ఎలా తయారు చేస్తారంటే.**

గాజు గిన్నెలో సోయా మైనం వేసి వేడి నీటిలో ఈ మైనాన్ని ఉంచాలి. డైరెక్ట్‌గా మంట మీద ఉంచకూడదు. అప్పుడప్పుడూ కదిలిస్తూ ఉండాలి. మైనాన్ని చిన్న గాజు కూజాలలో వేయాలి. ఈ కరిగిన మైనానికి కొద్దిగా సువాసనకోసం ఫ్లేవర్స్ కలిపితే క్యాండిల్ వెలుగుతున్నంత సేపూ మంచి వాసన చుట్టూ అల్లుకుంటుంది.

కంటైనర్ మధ్యలో చిన్న మైనం ఒత్తిని ఉంచాలి. మైనం గట్టిపడే వరకు ఉంచాలి. కంటైనర్ కదిలించకుండా అలాగే ఉంచాలి. మరుసటి రోజు ఒత్తిని కొద్దిగా కత్తిరించాలి. ఈ క్యాండిల్స్ ఫంక్షన్స్, పెద్ద మాల్స్, ఏదైనా వేడుకల్లో ప్రత్యేకంగా కనిపిస్తాయి.







ఒకప్పుడు కట్టెల పొయ్యి మీద వంట చేసే వారు. కాలంతో నెమ్మదిగా కిరోసిన్ స్టవ్, తర్వాత గ్యాస్ వంటి సదుపాయాలు వచ్చాయి. వంట చేసే గది, వండే స్టవ్ శుభ్రంగా ఉంటేనే తినే ఆహారం కూడా శుభ్రంగా ఉంటుంది. ఆరోగ్యానికి కారణం అవుతుంది. లేదంటే తినే పదార్థాలలో నాణ్యత ఉన్నా, పరిసరాలు సరిగా లేనప్పుడు అనారోగ్యాలు తప్పవు. వారంలో రెండు సార్లు స్టవ్ క్లీన్ చేసినా మళ్ళీ వంట చేయగానే అదే స్థితిలోకి వచ్చేస్తుంది స్టవ్.. పెద్ద వంట చేసినా చిన్న వంట చేసినా వంటగదిలో స్టవ్ బర్నర్స్ చిరాగ్గా తయారయిపోతాయి. వెంట వెంటనే వాటిని క్లీన్ చేయాలంటే పెద్ద పనిలా అనిపిస్తుంది. వారంలో ఏదో ఒకరోజు పెట్టుకుని క్లీన్ చేసినా మళ్ళీ అదే నూనె మరకలు, జిడ్డు, పదార్థాలు పొంగి పొర్లిన చారలు పడుతూ చికాకు తెప్పిస్తాయి. ఈ పరిస్థితిని దాటాలంటే వంటగదిలో ఈ చిట్కాలు పాటించాల్సిందే. అవేమిటంటే..

# స్టవ్ బర్నర్స్ ఇంత ఈజీగా క్లీన్ చేయచ్చని తెలుసా.. ప్రయత్నించండి

గ్యాస్ స్టవ్‌లపై ఉన్న బర్నర్స్ శుభ్రం చేయడం అనేది అస్తమానూ చేస్తున్నా కూడా మళ్లీ వంట చేసే సరికి వాటికి అదే మకిలి పట్టుకుంటుంది. లేదా నీళ్ళు, సబ్బు, సర్ఫ్ వంటివి బర్నర్ లోపలికి వెళ్ళి మంట వచ్చే దారులుకు అడ్డం పడతాయి. దీనితో మంట సరిగా రాక ఇబ్బంది పడాల్సి వస్తుంది.

1. గ్యాస్ శుభ్రం చేసేటప్పుడు మంటను ఆఫ్ చేసి, LPG ఆఫ్ చేసి అప్పుడు ఆఫ్ పొజిషన్ లో ఉంచి శుభ్రం చేయాలి. బర్నర్ క్యాప్స్ తీసేయాలి.
2. నాన్ బ్రాసివ్ స్క్రబ్బింగ్ ప్యాడ్, క్లాత్, సబ్బు ఉపయోగించి బర్నర్లను క్లీన్ చేయాలి. పైన ఉండే స్టీల్ ప్లేట్స్ ని కనీసం ఇరవై నిమిషాల పాటు వేడి నీటిలో సర్ఫ్ వేసి నానబెట్టాలి.
3. ఒక భాగం నీరు, మూడు భాగాల బేకింగ్ సోడా కలిపి పేస్ట్‌లా చేసి దానిని స్టవ్ చుట్టూ అప్లై చేసి 20 నిమిషాల తర్వాత స్పాంజ్‌తో తుడిస్తే సరిపోతుంది.



4. నాన్ బ్రాసిన్ స్క్రబ్బింగ్ ప్యాడ్ తో తుడవడం వల్ల ఈజీగా స్టవ్ క్లీన్ అవుతుంది. అయితే ఎక్కువ సేపు ఎండలో ఆరనిచ్చి అప్పుడు స్టవ్ మళ్ళీ బిగించాలి. లేదంటే మంట సరిగా రాకపోవడం, స్టవ్ పాడు కావడం వంటి సమస్యలు తలెత్తవచ్చు.
5. కొద్దిగా నిమ్మరసం, వెనిగర్ సాయంతో కూడా త్వరగా క్లీన్ చేయచ్చు.
6. ఇనో ప్యాకెట్ తో కూడా స్టవ్ క్లీనింగ్ చేయచ్చు..
7. రాత్రి స్టవ్ బర్నర్స్ నీటిలో నానబెట్టి కాస్త ఉప్పు, వెనిగర్, నిమ్మరసాన్ని వేసి ఉంచి ఉదయం చిన్న బ్రష్ సాయంతో క్లీన్ చేస్తే సరి.

వరుసగా నాలుగో రోజు

## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..

భారీగా పతనమైన ఆటో స్టాక్స్
424 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
117 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
6 శాతానికి పైగా నష్టపోయిన మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు నష్టాల్లో ముగిశాయి. ఆటో స్టాక్స్ లో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావాన్ని చూపింది. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 424 పాయింట్లు నష్టపోయి 75,311 వద్ద ముగిసింది. నిఫ్టీ 117 పాయింట్లు కోల్పోయి 22,795 వద్ద స్థిరపడింది. అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ మరో 7 పైసలు బలహీనపడి రూ. 86.71గా ఉంది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:**
టాటా స్టీల్ (1.88%), ఎల్ అండ్ టీ (1.10%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ (0.75%), ఏషియన్ పెయింట్స్ (0.35%), హెచ్డీఎఫ్సీ బ్యాంక్ (0.31%).

**టాప్ లూజర్స్:**
మహీంద్రా అండ్ మహీంద్రా (-6.07%), అదానీ పోర్ట్స్ (-2.57%), టాటా మోటార్స్ (-2.46%), సన్ ఫార్మా (-1.60%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (-1.52%).

## పసిడిపై బంగారం లాంటి రాబడి.. ఏడాదిలో ఎంతో మార్పు




**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి కారణంగా బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భౌతిక బంగారానికి ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన గోల్డ్ ఈటీఫ్‌ల ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి. గోల్డ్ ఈటీఎఫ్ పథకాల్లో సంవత్సరం క్రితం పెట్టుబడి పెట్టిన వారికి భారీగా రాబడి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా బంగారం ధరల్లో కనిపించిన పెరుగుదల గోల్డ్ ఈటీఎఫ్‌లలోనూ పెరిగింది. ఏడాదిలో క్రితం గోల్డ్ ఈటీఎఫ్‌లో పెట్టుబడి పెడితే అత్యధికంగా 35 శాతం నుంచి 38 శాతం రాబడిని ఇచ్చాయి. దాదాపు 15 గోల్డ్ ఈటీఎఫ్‌లు ఇదే తరహా రాబడిని అందించాయి. గత నెలలో అంటే జనవరి 2025లో గోల్డ్ ఈటీఎఫ్‌లలో నికర పెట్టుబడులు రూ.3751.4 కోట్లకు పెరిగింది. పెట్టుబడిదారులు గరిష్ఠ రాబడిని గోల్డ్ ఈటీఎఫ్‌లు అందించడంతో ఆసక్తిగా పెట్టుబడికి ముందుకు వస్తున్నారు. గోల్డ్ ఇటీఎఫ్‌లు అంటే ఓపెన్-ఎండ్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్‌లు. ఇవి బంగారం, సంబంధిత సాధనాల్లో పెట్టుబడి పెడతాయి. భౌతిక బంగారం ధరలతో పాటు గోల్డ్ ఈటీఎఫ్ యూనిట్ల ధర పెరగడానికి లేదా తగ్గడానికి ఇదే కారణం. ఇతర ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్ల మాదిరిగానే గోల్డ్ ఈటీఎఫ్‌లు కూడా స్టాక్ ఎక్స్చేంజ్‌లో జాబితా చేస్తారు. పెట్టుబడిదారులు తమ ట్రేడింగ్ ఖాతాల ద్వారా వాటిని కొనుగోలు చేసి విక్రయిస్తారు.

గోల్డ్ ఈటీఎఫ్‌లపై రాబడి నేరుగా బంగారం ధరకు సంబంధించినదని నిపుణులు చెబుతున్నారు. దేశీయ మార్కెట్లో బంగారం ధర గోల్డ్ ఈటీఎఫ్‌కు సంబంధించిన సురక్షితమైన పెట్టుబడి నేపథ్యంలో గోల్డ్ ఈటీఎఫ్‌లు ఈక్విటీ కంటే తక్కువ రిస్క్‌గా పరిగణిస్తారు. వారి రాబడి కూడా సాధారణంగా దీర్ఘకాలికంగా ఆకర్షణీయంగా ఉంటుంది. గత 25 సంవత్సరాల్లో బంగారం రాబడి పరంగా ఎస్ అండ్ పీ 500, నిఫ్టీ 50 వంటి ప్రధాన స్టాక్ మార్కెట్ సూచికలను అధిగమించింది. అయితే గోల్డ్ ఈటీఎఫ్ రాబడి భవిష్యత్తులో కూడా కొనసాగుతుందని అనుకోలేమని నిపుణులు సూచిస్తున్నారు.

## యూపీఐ ద్వారా పీఎఫ్ విత్‌డ్రా.. ఈపీఎఫ్ఓ సంచలన నిర్ణయం




**న్యూఢిల్లీ:** ఈపీఎఫ్ఓ ద్వారా వేగవంతంగా నిధుల బదిలీలను లక్ష్యంగా పెట్టుకున్నందున ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) ఖాతాదారులు త్వరలో యునైటెడ్ పేమెంట్ ఇంటర్ ఫేస్ (యూపీఐ) ద్వారా ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) క్లెయిమ్స్‌ను ఉపసంహరించుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. దీనికి సంబంధించిన ఈపీఎఫ్ఓ ఇప్పటికే ఒక ప్రణాళికను సిద్ధం చేసిందని, రాబోయే రెండు నుంచి మూడు నెలల్లో యూపీఐ ప్లాట్‌ఫారమ్స్‌లో ఈ ఫీచర్ ప్రారంభించడానికి నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో చర్చలు జరుపుతుందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా 7.4 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నఈపీఎఫ్ఓకు యూపీఐ సేవలను అందుబాటులోకి తీసుకొస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు.

ఈపీఎఫ్‌ను యూపీఐకు లింక్ చేయడం ద్వారా ప్రభుత్వం ఆర్థిక లావాదేవీలను సరళీకృతం అవుతాయి. వేగవంతమైన క్లెయిమ్ ప్రాసెసింగ్‌తో పాటు ఒకసారి ఇంటిగ్రేట్ చేసిన తర్వాత క్లెయిమ్ మొత్తాలను సబ్ స్క్రైబర్లు డిజిటల్ వాలెట్ల ద్వారా సులభంగా యాక్సెస్ చేసుకునే అవకాశం ఉంటుంది. అలాగే క్లెయిమ్ ప్రాసెసింగ్ సమయాన్ని తగ్గిస్తుంది. యూజర్ ఫ్రెండ్లీ అనుభవాన్ని వినియోగదారులు పొందుతారని నిపుణులు చెబుతున్నారు. అలాగే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వాణిజ్య బ్యాంకులతో కలిసి కార్మిక మంత్రిత్వ శాఖ ఈపీఎఫ్ఓకు సంబంధించిన డిజిటల్ వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేస్తోంది. ఇలాంటి చర్యలు ఉపసంహరణ ప్రక్రియను సులభతరం చేస్తున్నాయి.

# ఆదిలోనే ఆఫ్ఘన్‌కు చెక్

### కప్పు కొట్టేందుకే వచ్చామన్నారు..
### 100 పరుగుల తేడాతో సౌతాఫ్రికా చేతిలో చిత్తయ్యారు..!

**కరాచీ:** "ఇక్కడికి ఏదో మ్యాచ్‌లు ఆడి వెళ్లడానికి మేం రాలేదు.. కప్ తీసుకెళ్లడానికే వచ్చాం" ఛాంపియన్స్ ట్రోఫీలో తమ తొలి మ్యాచ్‌కు ముందు అఫ్గానిస్థాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిద్ చేసిన వ్యాఖ్యలివి. 1983లో వన్డే ప్రపంచకప్ టోర్నీలో ఆడేందుకు వెళ్లినప్పుడు భారత కెప్టెన్ కపిల్ దేవ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేశాడు. కానీ దాన్ని నిజం చేసి చూపించాడు. తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ముందు అఫ్ఘానిస్తాన్ కెప్టెన్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశాడు. కానీ ప్రదర్శనలో మాత్రం ఆ జట్టు తేలిపోయింది.

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దక్షిణాఫ్రికాతో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్ జట్టు 107 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. దీంతో తొలి మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్ ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ఈ టోర్నీలో అఫ్ఘానిస్థాన్ తన తర్వాతి మ్యాచ్‌లోల ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లతో తలపడనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ జట్టు సెమీస్ చేరడం అటుంచితే.. ఒక్క మ్యాచ్ గెలిచినా.. అద్భుతమే.

కాగా ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 315 పరుగులు చేసింది. ఓపెనర్ రికెల్టన్ సెంచరీ చేశాడు. టెంబా బవుమా, వాన్ డర్ డస్సెన్, మార్‌క్రమ్‌లు హాఫ్ సెంచరీలు చేశారు. అఫ్ఘానిస్థాన్ బౌలర్లలో నబీ 2 వికెట్లు తీశాడు. ఫజల్‌హక్ ఫరూఖీ, అజ్మతుల్లా, నూర్ అహ్మద్‌లు ఒక్కో వికెట్ తీశారు.

అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన అఫ్ఘానిస్థాన్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. భారీ ఆశలు పెట్టుకున్న ఓపెనర్లు నిరాశపరిచారు. గుర్బాజ్ (10), ఇబ్రహీం జద్రాన్ (17) త్వరగానే ఔట్ అయ్యారు. అయితే రెహ్మత్ షా(90) ఒంటరి పోరాటం చేశాడు. అయితే అతడి పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో కగిసో రబాడ మూడు వికెట్లు తీశాడు. లుంగీ ఎంగిడి 2, ముల్డర్ 2, మార్కో జాన్సన్ 1, కేశవ్ మహారాజ్ 1 వికెట్ తీశారు.






## గంగూలీ బయోపిక్‌లో రాజ్ కుమార్ రావు..





**న్యూఢిల్లీ:** టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ జీవిత చరిత్ర ఆధారంగా ఓ సినిమా రాబోతుందని గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ మూవీలో దాదా పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు రాజ్ కుమార్ రావు నటించబోతున్నట్లు తెలుస్తుంది. తాజాగా ఇదే విషయంపై గంగూలీ స్పందించాడు.

"నేను విన్నంతవరకు నా బయోపిక్‌లో బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావు నటించబోతున్నాడు. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. అలాగే ఇది ప్రకటించిన అనంతరం తెరపైకి రావడానికి కనీసం సంవత్సరం కంటే ఎక్కువ సమయం పడుతుందంటూ" గంగూలీ చెప్పుకోచ్చాడు.

మరోవైపు ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి రాజ్ కుమార్ రావుని సంప్రదించగా.. అతడు ఓకే చెప్పినట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రాన్ని లవ్ ఫిల్మ్స్ తెరకెక్కించనుండగా.. విక్రమాదిత్య మొత్వానీ దర్శకత్వం వహించనున్నాడు. మరోవైపు ఇప్పటికే పారిశ్రామిక వేత్త శ్రీకాంత్ బయోపిక్‌లో నటించిన రాజ్ కుమార్ రావు దాదా బయోపిక్‌లో నటిస్తే ఎలా ఉంటాడో అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.

గంగూలీ క్రికెట్ కెరీర్ విషయానికి వస్తే.. భారత్ తరపున అతడు 113 టెస్టులు మరియు 311 వన్డేలు ఆడాడు. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన గంగూలీ అంతర్జాతీయ కెరీర్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి 18,575 పరుగులు చేశాడు. 2008లో క్రికెట్ నుంచి రిటైర్ అయిన అనంతరం బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా.. తరువాత భారత క్రికెట్ నియంత్రణ మండలి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించాడు

కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణపై

## భారత్ ఆసక్తి!

commonwealth games

**న్యూఢిల్లీ:** 2036లో ఒలింపిక్స్ పోటీలను నిర్వహించాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్న భారత్.. అంతకంటే ముందే మరో ప్రతిష్టాత్మక కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులనూ దక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది. 2030లో జరగాల్సిన కామన్వెల్త్ క్రీడల నిర్వహణ పట్ల భారత్ ఆసక్తిగా ఉన్నట్టు కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు.

2030 కామన్వెల్త్ గేమ్స్ నిర్వహణకు సంబంధించి 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్' తెలిపేందుకు గాను ఈ ఏడాది మార్చి 31 దాకా గడువుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ప్రక్రియకు తుది మెరుగులు దిద్దుతున్నట్టు సమాచారం. ఒకవేళ 'కామన్వెల్త్' హక్కులను దక్కించుకుంటే.. గ్లాస్గోలో తొలిగించిన పది క్రీడాంశాలను 2030లో ఆడించే అవకాశముంది.

# చరిత్ర సృష్టించిన కేరళ..

### తొలిసారి రంజీ ఫైనల్లోకి !

**అహ్మదాబాద్:** దేశవాళీ క్రికెట్ రంజీ ట్రోఫీ ఫైనల్లోకి కేరళ దాదాపు ప్రవేశించింది. తొలి సెమీస్ మ్యాచ్‌లో ఇవాళ అయిదో రోజు ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో రెండు పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. దీంతో దాదాపు ఫైనల్లో అడుగుపెట్టే అవకాశాన్ని కేరళ కన్ఫర్మ్ చేసుకున్నది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కేరళ 457 రన్స్ చేయగా, గుజరాత్ జట్టు 455 రన్స్‌కు ఆలౌటైంది.

అయితే ఇవాళ అయిదో రోజు మ్యాచ్ ఆసక్తికరంగా సాగింది. చివరి రోజు కేరళ ఆధిక్యాన్ని దాటేందుకు గుజరాత్ మరో 28 పరుగలు చేయాల్సి ఉంది. గుజరాత్ వద్ద కేవలం మూడు వికెట్లు ఉన్నాయి. అయితే కేరళ స్పిన్నర్ ఆదిత్య సార్వతే.. మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో గుజరాత్ ఆధిక్యాన్ని సాధిస్తుందనుకున్న సమయంలో.. కేరళ స్పిన్నర్ ఆదిత్య ఆ జట్టుకు చెక్ పెట్టేశాడు. చివరి మూడు వికెట్లను అతనే తీసుకున్నాడు. కేవలం రెండు పరుగుల తేడాతో ఆధిక్యాన్ని కోల్పోయింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కేరళ ఇప్పటికే 34 రన్స్ ఆధిక్యాన్ని సాధించింది. మ్యాచ్ డ్రా అయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో.. ఫస్ట్ ఇన్నింగ్స్ లీడ్ ఆధారంగా కేరళ ఫైనల్ ఎంట్రీ ఖరారైనట్లే. రంజీ ట్రోఫీలో 68 ఏళ్ల తర్వాత కేరళ జట్టు తొలిసారి ఫైనల్లోకి ప్రవేశించింది. చాలా నాటకీయమైన రీతిలో ఫైనల్ ఎంట్రీ దక్కింది. క్వార్టర్స్ మ్యాచ్‌లో కూడా ఒక్క పరుగు లీడ్‌తో సెమీస్‌కు కేరళ ఎంటర్ అయ్యింది. జమ్మూకశ్మీర్‌తో జరిగిన మ్యాచ్‌లో.. కేరళ జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో ఒక్క పరుగు ఆధిక్యాన్ని సాధించింది. అయితే మ్యాచ్ డ్రా కావడంతో.. ఫస్ట్ ఇన్నింగ్స్ లీడ్ ఆధారంగా ఆ జట్టు సెమీస్‌లోకి ఎంటర్ అయ్యింది.



విదర్భతో జరుగుతున్న రెండో సెమీస్ మ్యాచ్‌లో.. ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 407 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగింది. అయితే ఇవాళ అయిదో రోజు కడపటి వార్తలు అందేసరికి ఆ జట్టు ఆరు వికెట్ల నష్టానికి 208 రన్స్ చేసింది. మరో 50 ఓవర్లలో ముంబై 198 రన్స్ చేయాల్సి ఉంది. ఒకవేళ మ్యాచ్ ఓడితే.. ముంబై ఫైనల్ ఆశలు గల్లంతు అయినట్లే. ఒకవేళ మ్యాచ్ డ్రా అయినా.. ఫస్ట్ ఇన్నింగ్స్ లీడ్ ఆధారంగా విదర్భ ఫైనల్లోకి వెళ్తుంది.

# అంజనాదేవికి ఏమీ కాలేదు



## సోషల్ మీడియా వార్తలపై చిరుటీమ్ స్పందన

**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి తల్లి అంజనాదేవి అస్వస్థతకు గురైయినట్లు ఉదయం నుంచి సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున అంజనాదేవి అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించినట్లు.. వైద్యులు ప్రస్తుతం అంజనమ్మకి చికిత్స అందిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలపై చిరంజీవి టీమ్ తాజాగా స్పందించి స్పష్టత ఇచ్చింది. అంజనాదేవి అస్వస్థతకు గురైయినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలిపింది. రెగ్యులర్ చెకప్‌లో భాగంగానే గత వారం అంజనమ్మను ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు తెలిపింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉందని చిరంజీవి టీమ్ వెల్లడించింది.

# హరిహర వీరమల్లు నుంచి 'కొల్లగొట్టినాదిరో' సాంగ్ ప్రోమో విడుదల





**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'హరిహర వీరమల్లు' నుండి సెకండ్ సింగిల్ 'కొల్లగొట్టినాదిరో' ఫిబ్రవరి 24న విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా శుక్రవారం సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. కథానాయకుడు పవన్ కళ్యాణ్ తో పాటు కథానాయిక నిధి అగర్వాల్ పై ఈ పాటను నైట్ ఎఫెక్ట్స్ లో చిత్రీకరించారు. విశేషం ఏమంటే... ఇందులో అనసూయ భరద్వాజ్‌తో పాటు పూజిత పొన్నాడ కూడా స్పెషల్ అప్పీయరెన్స్ ఇచ్చింది. 'కోర కోర మీసాలతో, కొదమ కొదమ అడుగులతో... కొంటెకొంటె చణుకులతో, కొలిమి లాంటి మగటిమితో... సరసర వచ్చినాడు చిచ్చర పిడుగంటి వాడు' అంటూ సాగే ఈ పాటను చంద్రబోస్ రాశారు. దీనిని ఎం.ఎం. కీరవాణి స్వరపర్చగా, దీనిని మంగ్లీ , రాహుల్ సిప్లిగంజ్, రమ్య బెహరా, యామిని ఘంటసాల గానం చేశారు.ఎ.ఎం. రత్నం సమర్పణలో ఆయన సోదరుడు దయాకరరావు 'హరిహర వీరమల్లు' సినిమాను నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా ఇది విడుదల కాబోతోంది. తొలి భాగాన్ని మార్చి 28న విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాకు క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. అయితే బాలెన్స్ ఉన్న చిత్రీకరణ ను పూర్తి చేసే బాధ్యతను ఎ.ఎం. రత్నం తనయుడు జ్యోతికృష్ణ భుజానికి కెత్తుకున్నాడు. పవన్ కళ్యాణ్ పాల్గొనగా నాలుగు రోజుల ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ ఒక్కటి ఇంకా చిత్రీకరించాల్సి ఉందని, అది మినహా మిగిలిన భాగానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ మొత్తం జరుగుతోందని తెలుస్తోంది. ఈ సినిమాలో ఇతర ప్రధాన పాత్రలను బాబీ డియోల్, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నోరా ఫతేహి తదితరులు పోషించారు.

# హెబ్బా.. రెడ్ డ్రెస్‌లో ఏముంది అబ్బా!



టాకీస్: అందాల బ్యూటీ, గ్లామర్ క్వీన్ హెబ్బా పటేల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. అలా ఎలా అనే సినిమాతో వెండితెరకు పరిచయమైన ఈ అమ్మడు, కుమారి 21 ఎఫ్ సినిమాతో కుర్రకారును మాయ చేసి, మంచి క్రేజ్ సంపాదించుకుంది. అడోరకం ఈడోరకం, ఎక్కడికిపోతావు చిన్నవాడ, మిస్టర్, అంధగాడు, ఏంజెల్, 24 ముద్దులు, భీష్మ, ఓరేయ్ బుజ్జిగా,ఓదెల రైల్వే స్టేషన్, అలా నిన్ను చేరి ధూమ్ ధామ్ వంటి చాలా సినిమాల్లో నటిం చింది. ఇక కుమారి 21 ఎఫ్ సినిమా తర్వాత ఈ అమ్మడు మళ్లీ అంత ఫేమ్ సంపాదించుకుంది అంటే, ఓదెలా మూవీ తోనే. ఈ సినిమాలో ఈ బ్యూటీ తన అందం, నటనతో అందరినీ ఆకట్టుకుంది. అయితే అందం, అభినయం ఉన్నా ఈ బ్యూటీకి మాత్రం ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదనే చెప్పాలి. చాలా సినిమాల్లో నటించి మెప్పించినప్పటికీ, స్టార్ హీరోల సినిమాల్లో మాత్రం ఛాన్స్ దక్కించుకోలేక పోయింది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం తన లేటెస్ట్ ఫొటో షూట్‌తో కుర్రకారు ను ఆకట్టుకుంటుంది. రెండ్ కలర్ డ్రెస్‌లో తన అందాలతో కుర్రకారుకు విందు భోజనం పెట్టేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఈ ఫొటోస్ చూసిన కుర్ర కారు, రెడ్ డ్రెస్‌లో సూపర్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ బ్యూటీ ప్రస్తుతం ఆద్య, ఓదేలా2 సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నట్లు సమాచారం.

# చిరంజీవి ప్రోత్సాహం మరువలేనిది: సందీప్ కిషన్

**టాకీస్:** 'మజాకా'తో ప్రేక్షకులను అలరించేందుకు నటుడు సందీప్ కిషన్ సిద్ధమయ్యారు. ఈ మూవీ మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న ఇది విడుదల కానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందీప్‌కిషన్ పలు విశేషాలు పంచుకున్నారు. కెరీర్‌లో తాను ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని అన్నారు. ప్రస్తుతం మంచి ప్రాజెక్టులు చేస్తున్నానని తెలిపారు. ఎవరి సపోర్ట్ లేకుండా నేను పరిశ్రమలోకి వచ్చాను. కెరీర్ పరంగా ఎత్తుపల్లాలు చూశాను. 'ఒక్క అమ్మాయి తప్ప' సినిమా ముందు వరకూ ఎంతోమంది దర్శక, నిర్మాతలు తమ కథలను నాతో పంచుకునేవారు. కథలపై నాకొక మంచి జడ్జిమెంట్ ఉంటుందని వారు నమ్మేవారు. కానీ ఆ తర్వాత పరిస్థితి మారిపోయింది. నా సినిమాలు వరుస పరాజయాలు అందుకోవడంతో నా జడ్జిమెంట్ సరైనది కాదని వారు భావించారు. కెరీర్‌లో వరుస అపజయాలు, రిలేషన్‌షిప్ బ్రేకప్.. జీవితంలో ఏం జరుగుతుందో అర్థంకాక ఎంతో



బాధపడ్డా. రోజుకు అరకిలో ఐస్‌క్రీమ్, చాక్లెట్స్ తినేశా. నా బరువు 97 కిలోలకు చేరింది. ఆ సమయంలో నా స్నేహితుడు రూ.కోటి ఇస్తే 'నిను వీడని నీడను నేనే' చేసి రూ.6 కోట్లు రాబట్టా. అక్కడినుంచి జాగ్రత్తగా కథలు ఎంచుకుంటూ కష్టపడుతున్నా' అని సందీప్ కిషన్ అన్నారు. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా తెరకెక్కిస్తోన్న చిత్రంలో యాక్ట్ చేయడంపై మాట్లాడుతూ.. ఆ సినిమా చిత్రీకరణ మొదలుపెట్టామంతే. వరుస ప్రాజెక్టుల వల్ల నా డేట్స్ సర్దుబాటు చేయడం వీలుపడలేదు. త్వరలోనే ఆ సెట్‌లోకి అడుగుపెడతా. 'మజాకా' షూట్ సమయంలో ఓసారి అనుకోకుండా అగ్ర కథానాయకుడు చిరంజీవిని కలిశాను. మా మధ్య మంచి అనుబంధం ఉంది. 'మజాకా' కథ చేస్తున్నందుకు నన్ను మెచ్చుకున్నారు. ఈ కథ తనకెంతో నచ్చిందని.. తాను చేయలేకపోయినందుకు బాధపడ్డానని తెలిపారు. 'సంజయ్‌తో నువ్వు సినిమా చేస్తున్నావని తెలిసింది. ఒక తెలుగు హీరోతో వాళ్లు సినిమా చేయాలనుకుంటున్నారంటే మనం గర్వపడాల్సిన విషయం' అన్నారు. ఆ మాట నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. నేను ఆ విధమైన ప్రశంసలనే అందరి నుంచి కోరుకుంటున్నా అని చెప్పారు.

## మేనల్లుడు హీరోగా

# ధనుష్ దర్శకత్వం

## జాబిలమ్మ నీకు అంతకోపమా..బాగుందన్న నటి కీర్తి





టాకీస్: హీరో ధనుష్ నల్లుడు పవిష్ నారాయణ్ నటుడిగా ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'నిలవుకు ఎన్‌మేల్ ఎన్నడి కోబమ్' ధనుష్ దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. అనిఖ సురేంద్రన్, ప్రియాప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకువచ్చింది. తాజాగా దీనిని నటి కీర్తిసురేశ్ వీక్షించారు. ఈ సినిమా తనకెంతో నచ్చిందని సోషల్‌మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ధనుష్ మేకింగ్ స్టైల్‌ను ఆమె మెచ్చుకున్నారు. 'ఇప్పుడే ఈ చిత్రాన్ని వీక్షించాను. సినిమా చాలా కొత్తగా, చూడచక్కగా ఉంది. ధనుష్.. మీ డైరెక్షన్‌లో మరో విభిన్నమైన కథను సృష్టించారు. మీ మేకింగ్ స్టైల్ నాకెంతో నచ్చింది. ఇంతమంది నటీనటులను స్క్రీన్‌పై చూడటం ఎంతో సంతోషంగా ఉంది.

# ఓటీటీలోకి వస్తోన్న ఎమర్జెన్సీ






**టాకీస్:** కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎమ్జర్గ÷న్సీ'. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చి చివరకు జనవరి 17న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. త్వరలో ఇది ఓటీటీ వేదికగా ప్రేక్షకులకు అందుబాటులో ఉండనుందని కంగన తాజాగా ప్రకటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా మార్చి 17 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుందని తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారంగా చేసుకొని 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని రూపొందించారు. అత్యవసర పరిస్థితి ప్రకటించిన సందర్భాన్ని ఆధారంగా చేసుకొని దీనిని సిద్ధం చేశారు. ఇందిరాగాంధీగా కంగనా నటించగా.. జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, అటల్ బిహారీ వాజ్ పేయిగా శ్రేయాస్ తల్పడే నటించారు. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీ స్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేక పోయింది. రూ.60 కోట్లతో దీనిని రూపొందించ గా.. రూ.21 కోట్లు మాత్రమే ఈ సినిమా రాబట్టినట్లు అంచనా.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.